

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0 (సోమవారం)
కనిష్ఠం : 27.0

వచ్చేస్తోంది.. మరో హై..వే! 7



అనపర్తి మినీ మహానాడులో ఎన్‌టీఆర్, మూలారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి తదితరులు

మహానాడు జోష్

- నియోజకవర్గాల్లో మినీ మహానాడు
- కేడర్‌లో ఉప్పొంగుతున్న ఉత్సాహం
- 3 నియోజకవర్గాల్లో నిర్వహణ
- నేడు మూడు చోట్ల అమలు
- 22న రాజానగరంలో ఏర్పాట్లు
- కమిటీల నియామకంపై కసరత్తు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

టీడీపీలో మహానాడు జోష్ పెరిగింది. ఇప్పటికే సంస్థాగత ఎన్నికలతో జోరు పెంచిన నేతలు ఇక మహానాడుపై దృష్టి పెట్టారు. ఈ నెల 27,28,29వ తేదీల్లో కడపలో టీడీపీ మహానాడు జరగనున్న సంగతి తెలిసిందే. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ మహానాడుకు జిల్లా నుంచి నియోజకవర్గాల వారీ తరలివెళ్లడానికి పార్టీ శ్రేణులు సిద్ధం అవుతున్నాయి. మహానాడు నిర్వహణకు ముందు సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయడం టీడీపీ ఆనవాయితీ. మొత్తం కమిటీల పూర్తి చేసిన తర్వాత మహానాడులో పార్టీ అధ్యక్షుడిని లాంఛనంగా ఎన్నుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత నెల 14 నుంచి కుటుంబ సాధికారిత సారథుల నియామకంతో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ మొదలైంది. తర్వాత బూత్, గ్రామ, మండల, పట్టణ, డివిజన్, నియోజకవర్గ, పార్లమెంట్ పరిధి కమిటీలతో పాటు, వాటి అనుబంధ కమిటీల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రాజమండ్రి సిటీ, రూరల్‌లో ఇంచుమించు కమిటీలను నియమించారు. కమిటీల నియామకంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ముందంజలో ఉన్నారు. సిటీలో మొదటగా మినీ మహానాడు నిర్వహించారు. అనపర్తిలో నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీల నియామకం జోరందుకుంది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్ రెడ్డి టీడీపీ కన్వీనర్‌గా ఉన్నారు. అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాల మినీ మహానాడు సోమవారం నిర్వహించారు. నిడదవోలు, గోపాలపురం,కొవ్వూరు నియోజకవర్గాల పరిధిలో మంగళవారం మినీ మహానాడు నిర్వహించనున్నారు. రాజానగరం నియోజకవర్గ మినీ మహానాడు ఈ నెల 22వ తేదీన జరగనుంది. రాజానగరంలో సంస్థాగత ఎన్నికలు ఇంకా పూర్తి కాలేదు. ఇక్కడ ఇన్‌చార్జిగా బొడ్డు వెంకటరమణ చౌదరి ఉన్న సంగతి తెలిసిందే. కానీ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా ఉన్న సంగతి తెలిసిందే.ఆయన కుమారుడు అభిరామ్ కూడా ఇక్కడ పార్టీలో పట్టుకోసం ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పదవి లభించడంతో నిడదవోలు టీడీపీలో ఉత్సాహం పెరిగింది. కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం మినీ మహానాడు నిర్వహిస్తారు.గోపాలపురంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో చాలా వరకూ కమిటీల నియామకం పూర్తయింది.ప్రధాన కమిటీలను ప్రకటించాల్సి ఉంది. మంగళవారం మినీ మహానాడు జరగనుంది. జిల్లాలో సంస్థాగత ఎన్నికలకు సంబంధించి చాలా చోట్ల పాతనేతలకే పదవులు దక్కగా కొద్దిగా కొత్త ముఖాల ప్రాధాన్యత ఇచ్చారు. అయితే టీడీపీకి పూర్వం నుంచి అభిమానులుగా ఉన్న చాలా కులాలకు కనీస ప్రాధాన్యత ఇచ్చి, పార్టీని మరింత బలోపేతం చేసుకుందామనే ఆలోచన నేతలకు లేకపోవడం సమస్యగా మారింది.

మండే ఎండలకు... మందు!





(కాకినాడ/రాజమహేంద్రవరం ఆంధ్రజ్యోతి)

వేసవి ఉపశమనం కోసం మందుబాబులు తెగ తాగేస్తున్నారు. దీంతో మద్యం విక్రయాలు రయ్‌మని పరుగులు తీస్తున్నాయి. వేసవి తీవ్రత కారణంగా గత నెల నుంచి మద్యం విక్రయాలు భారీగా పెరిగిపోయాయి. ఒక్క ఏప్రిల్‌లోనే మందుబాబులంతా కలిపి ఉమ్మడి జిల్లాలో రూ.293 కోట్ల మద్యం తాగేశారు. గతేడాది ఇదేనెలలో విక్రయాలతో పోల్చితే రూ.17 కోట్లు అధికం. బీర్ల విక్రయాలైతే ఏకంగా 133 శాతం పెరిగాయి. గతేడాది ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో మం దు బాబులు 1.21 లక్షల బీరు కేసులు తాగేస్తే ఈ ఏడాది ఏప్రిల్‌లో 2.81 లక్షల బీరు కేసులు ఎత్తేశారు.విభజిత జిల్లాల వారీగా పరిశీలిస్తే కాకినాడ జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో రూ.95.52 కోట్లు అమ్మకాలుంటే ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.104 కోట్లకు చేరింది. తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో రూ.90.76 కోట్లు ఉంటే ఇప్పుడు రూ.100.23 కోట్లకు చేరింది.కోనసీమను మినహాయిస్తే ఈ రెండు జిల్లాల్లో విక్రయాలు భారీగా పెరిగాయి.

ఈనెలలో అప్పుడే రూ.150 కోట్లకుపైగానే..

మే నెలలోను మందుబాబులు తగ్గేదేలే అన్నట్లు తెగ తాగేస్తున్నారు. ఇప్పటి వరకు కాకినాడ జిల్లాలో రూ.53 కోట్ల విలువైన మద్యం తాగేశారు. బీరు కేసులు గతేడాది మే నెల 16 వరకు జిల్లాలో 24,339 విక్రయించగా ఇప్పుడు 56,375 అమ్ముడయ్యాయి. కోనసీమ జిల్లాలో గతేడాది మే నెల మొత్తం మీద రూ.98.88 కోట్ల విక్ర యించగా ఈనెలలో ఇప్పటివరకు రూ.45.41కోట్ల మద్యం అమ్ముడైంది. తూర్పుగోదావరి జిల్లాలో 58,950 ఐఎంల్ కేసులు, 50,587 బీరు కేసులు విక్రయించడంతో రూ.49.46 కోట్ల విక్రయాలు నమోదయ్యాయి. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం ధరలు మందుబాబులకు షాక్ కొట్టాయి. నాసిరకం బ్రాండ్లకు ప్రీమియం ధరలు వసూలు చేసి వందల కోట్లు పిండేశారు.ప్రస్తుత ప్రభుత్వం ధరలు అమాంతం తగ్గిం చేసింది. ప్రముఖ బీరు,ఐఎంఎల్ బ్రాండ్లను అన్ని దుకాణాల్లో అందుబాటులో ఉంచింది.ధరలు తగ్గడం.. వేసవితాపంతో మందుబాబులు తెగ తాగేయడంతో అమ్మకాలు పెరిగాయి.

ఉమ్మడి జిల్లాలో బీర్లు పొంగాయ్

- వేసవి ఉపశమనం పేరుతో తెగతాగేశారు
- ఉమ్మడి తూ.గో.జిల్లాలో పెరిగిన అమ్మకాలు
- ఏప్రిల్‌లో రూ.293 కోట్ల మద్యం విక్రయాలు
- గతేడాది పోల్చితే రూ.17 కోట్లు అధికం
- రికార్డుస్థాయిలో బీర్లను తాగేసిన ప్రియులు
- గత నెలలో 2.81 లక్షల బీరు కేసులు
- నిరుడు ఇదే నెలలో 1.21 లక్షల కేసులే
- గతేడాదితో పోల్చితే 133 శాతం అధికం
- ఈ నెలా మద్యం విక్రయాలు రయ్
- 16 నాటికి రూ.150 కోట్లు సేల్స్
- బీరు కేసులు 1.49 లక్షలు విక్రయం

ఊదిపారేస్తున్నారంతే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో బీర్లు, ఇతర ఐఎంఎల్ మద్యం విక్రయాలు కలిపి రూ.276 కోట్లు జరిగాయి.ఈ ఏడాది ఏప్రిల్‌లో విక్ర యాలు రూ.293 కోట్లకు పెరిగాయి. ఇందులో అత్యధికంగా బీర్లు అమ్ముడయ్యాయి.గతేడాది ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో 1,21,396 కేసుల బీర్లు విక్రయించగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏకంగా 2,81,637 కేసుల బీర్లు మందుబాబులు తాగేశారు.బీర్ల విక్రయాలు అప్పటితో పోల్చితే ఈసారి ఏకంగా 133 శాతానికిపైగా పెరిగాయి.

- కాకినాడ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో రూ.95.52 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది.ఇందులో 41,940 కేసుల బీర్లు ఉండగా, ఐఎంఎల్ మద్యం 96,317 కేసులు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌కు వచ్చేసరికి ఈనెలలో కాకినాడ జిల్లాలో విక్రయాలు రూ.104కోట్లకు పెరిగింది.ఒక్క బీర్లే ఏకంగా 97,796 కేసులు అమ్ముడయ్యాయి. కాకినాడ నార్త్ స్టేషన్ పరిధిలో గత నెలలో ఏకంగా రూ.26కోట్ల మద్యం అమ్ము డైంది. కాకినాడ సౌత్ స్టేషన్ పరిధిలో రూ.18 కోట్లు, తుని పరిధిలో రూ.15.84 కోట్ల విక్ర యాలు జరిగాయి.
- తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది ఏప్రిల్ నెలలో రూ.90.76 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగ్గా, ఈ ఏడాది 100.23కోట్ల మద్యం అమ్ముడైంది. ఒక్క బీర్ల విక్రయాల్లో ఏకంగా 114 శాతం పెరుగుదల నమోదైంది. అత్యధికంగా రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్ పరిధిలో గత నెలలో రూ.22.66 కోట్లు మద్యం విక్రయాలు జరగ్గా, బీర్ల విక్ర యాల్లో 131 శాతం వృద్ధి నమోదైంది. రాజమహేంద్రవరం దక్షిణం పరిధిలో రూ.20.44 కోట్లు, నిడదవోలు పరిధిలో 13.44కోట్లు, దేవర పల్లి 12.33 కోట్లు, కోరుకొండ 8.91 కోట్లు చొప్పున మద్యం విక్రయాలు జరిగాయి. దేవరపల్లి సర్కిల్ పరిధిలో గతేడాది ఏప్రిల్‌లో 3,623 కేసుల బీర్లు అమ్ముడైతే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏకంగా 9,253 బీర్ల కేసులు విక్రయించారు. బీర్ల విక్రయాల్లో గతేడాదితో పోల్చితే 155 శాతం అధికం.
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో రూ.90.11 కోట్ల మద్యం విక్రయాలు జరగ్గా ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.88.81 కోట్లు నమోదయ్యాయి. ఇక్కడ గతేడాదితో పోల్చితే ఏప్రిల్‌లో విక్రయాలు కొంత తగ్గాయి. ప్రధా నంగా ఈ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో ఈ జిల్లాలో 95,444 కేసుల ఐఎంఎల్ మద్యం అమ్ముడైతే ఈ ఏడాది ఏప్రిల్‌లో 1,17,484 కేసుల ఐఎంఎల్ అమ్ముడైంది.బీరు కేసులు అప్పట్లో 34,036 విక్రయిస్తే.గత నెలలో 79,005 కేసులు విక్రయింఆరు. బీర్ల విభాగంలో అమ్మకాలు అప్పటితో పోల్చితే 132 శాతం పెరిగాయి.

తవ్వేయ్.. తోలెయ్!





అధికారులు కళ్లుండీ చూడలేకపోతున్నారు.. నోరుండీ మాట్లాడలేకపోతున్నారు.. అధికారం ఉండీ అడ్డుకోలేకపోతున్నారు.. అక్రమార్కులు మట్టి, గ్రావెల్ అక్రమంగా తరలించుకుపోతున్నా చూస్తూ ఉండిపోతున్నారు.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా ప్రశ్నించలేకపోతున్నారు.. ఇది ఒక్క మండలంలో సమస్య కాదు.. రంగంపేట, గోకవరం, సీతానగరం మండలాల్లోనూ ఇదే పరిస్థితి.. అక్రమార్కులు మాత్రం ఎవరికివ్వాల్సింది వారికిచ్చేస్తే ఎలా మాట్లాడతారని అని ఆరోపించడం కొసమెరుపు..

- రెచ్చిపోతున్న మాఫియా
- అక్రమంగా మట్టి,గ్రావెల్ తరలింపు
- కన్నెత్తి చూడని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

గోకవరం, మే 19 (ఆంధ్రజ్యోతి) : మట్టి, గ్రావెల్ వ్యాపారం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. గోకవరం మండలంలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా అడ్డగోలుగా తరలిస్తున్నారు. అడ్డుకునేవారు లేక పేట్రేగిపోతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి దందాకు పాల్పడుతున్నా అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.అక్రమార్కులు యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు, ఇటుక బట్టీలకు తరలించి సొమ్ములు చేసుకుంటున్నారు. గోకవరం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. వాటిని చదును చేయడానికి మట్టి, కంకరకు గిరాకీ ఏర్పడింది. ఇదే అదునుగా అక్రమార్కులు మట్టి తవ్వకాలకు తెరలేపారు. వీరలింకపల్లి, గోకవరం, కొత్తపల్లి, తరతర ప్రాంతాల్లో అనేక ఇటుక బట్టీలు ఉన్నాయి. బట్టీల నిర్వహణకు అవసరమైన మట్టి పరిసర ప్రాంతాల్లో ఉండడంతో చెరువులను గుల్ల చేసేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఈ అక్రమ వ్యాపారం మూడు ట్రాక్టర్లు, ఆరు లారీల చందంగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా చెరువులు,ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి ధరలు నిర్ణయించుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. వీరలింకపల్లి గ్రామ సమీపంలో ఉన్న రాజు చెరువు, కొత్తపల్లిలో పెదపాత్రుని చెరువుల నుంచి ప్రస్తుతం మట్టి అక్రమ రవాణా జోరుగా జరుగుతోంది. రాజు చెరువు నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా టిప్ప ర్లతో ఏ జంకూ లేకుండా మట్టిని తరలిస్తు న్నారు. పెదపాత్రుని చెరువు నుంచి ఎక్కువగా రాత్రి వేళ రవాణా జరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో సాగుతున్న అక్రమ మట్టి దందాపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



వీరవల్లిలంక చెరువులో యంత్రాలతో మట్టి తవ్వి..టిప్పర్లలో తరలింపు



చెరువులు.. చేలు ఖాళీ...

రంగంపేటలో మట్టి దందా

రంగంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది వేసవి వచ్చిందంటే చాలు మట్టికి రెక్కలు వస్తాయి.. అక్కడ ఇక్కడ అని ఏముంది.. జిల్లా అంతటా యథేచ్ఛగా తరలించేస్తారు. అయినా అడిగే నాథులు ఉండరు.. పట్టించుకునే అధికారులు లేరు. మెరకపేరుతో మట్టిని తరలిస్తున్నా కళ్లప్పగించి చూస్తున్నారు. రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో సాగుతున్న దందా దీనికి ఉదాహరణ. గత కొంత కాలంగా గ్రామంలో రాత్రి పగలు తేడా లేకుండా ఎక్స్‌క వేటర్లతో మట్టిని తవ్వి ఎక్కువగా లే అవుట్లు, ఇటుక బట్టీలకు ట్రాక్టర్లతో తరలిస్తుంచేన్నారు. ప్రభుత్వానికి సీనరేజ్ కట్టకుండా అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్నారు. అయినా అధికారుల్లో మాత్రం చలనం లేదు.ఇంటి నిర్మాణం, మెరక పనులకు మట్టిని తరలించాలంటే గనులు, భూగర్భ, రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి.రెవెన్యూ కార్యాలయం నుంచి నిరభ్యంతర పత్రం పొందిన తర్వాత నిర్ణీత సీనరేజి రుసుం గనుల శాఖకు చెల్లించి అనుమతి పొందిన తరువాత మట్టి తవ్వకాలు జరుపుకోవచ్చు.కానీ ఎటువంటి అనుమతుల్లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.ట్రాక్టర్ మట్టి రూ.600 నుంచి రూ.700 వరకు విక్రయి స్తున్నా రు.గ్రామ వీధుల్లో ట్రాక్టర్లు రయ్, రయ్ మంటూ తిరుగుతుంటే చిన్న పిల్లలు, గ్రామ ప్రజలు బెంబేలెత్తుపోతున్నారు.అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని, గ్రామంలోని ట్రాక్టర్లు స్పీడును నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్ అన సూయను ఆంధ్ర జ్యోతి ఫోన్‌లో సంప్రదించగా మండలంలో ఎవరికీ పొలాల్లో మట్టి తవ్వకాలకు ఎటు వంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.



వడిశలేరులో పొలాల నుంచి మట్టి తరలింపు

గ్రావెల్ కొండలు.. కరిగిపోతున్నాయ్!

సీతానగరం,మే 19 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం మండలంలో ఇసుక, ఎర్రమట్టి అక్రమంగా తరలించేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. సీతానగరం మండలం నల్గొండ సమీపంలోని కొండలను దొలిచి ఎర్రమట్టి అక్రమంగా తరలించేస్తున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా యథేచ్ఛగా అక్రమ రవాణా సాగుతోంది. అధికారులు మాత్రం చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా తీసుకుని అక్రమార్కులు కొండలను తవ్వి ఎర్రమట్టిని అమ్ముకుంటూ కోట్లాది రూపాయలు గడిస్తున్నారు.దీనిపై సీతానగరం తహశీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా అక్రమ రవాణా విషయం తెలియదని వెంటనే చర్యలు తీసుకుంటానని తెలిపారు..

పీజీఆర్ఎస్ అర్జీలపై ఆడిట్

ప్రతి ఫిర్యాదుకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలి : కలెక్టర్ ప్రశాంతి




దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయిలో జరిగిన ఆడిట్ నివేదికల ప్రకారం 50 శాతం మంది ఫిర్యాదు దారులకు ఎండార్స్‌మెంట్‌లు అందలేదన్న ఆరోపణలు వస్తున్నాయని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి, ఇతర అధి కారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు ఎండార్స్‌మెంట్‌లు అందడంలేదనే ఫిర్యాదులు రాకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే ఫిర్యాదుపై సమగ్ర అవగాహన పొందవచ్చన్నారు. కొన్ని సమస్యలను ఎంపీడీవో, తహశీల్దార్, ఎస్‌హెచ్‌వో కూడిన మండల స్థాయి కమిటీకి నివేదిస్తున్నట్టు తెలిపారు. పరిష్కారం చూపలేని అంశాలకు కారణాలు తెలపకపోతే సీఎంవో నుంచి పదేపదే ఆదేశాలు వస్తూనే ఉంటాయని తెలిపారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సమకూర్చిన రూ.25 వేలు విలువైన కృత్రిమ అవయవాలను కలెక్టర్ ప్రశాంతి నలుగురికి అందించారు. హుకుంపేట పంచాయితీలో అక్రమాలు జరుగుతున్నాయని.. కమిటీ వేయాలని ఆదే గ్రామానికి చెందిన ఏ.శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు.కార్యక్రమంలో సీపీవో ఎల్.అప్పలకొండ, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, ఇన్‌చార్జి డీఎస్‌వో ఎంఆర్ఆర్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

డీపీవోలో గ్రీవెన్స్‌కి 40 అర్జీలు

రాజమహేంద్రవరం, మే 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్(పబ్లిక్ గ్రీవెన్స్) కు జిల్లా నలుమూలల నుంచీ వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ స్వయంగా మాట్లాడి 40 అర్జీలను స్వీకరించారు. వారి సమక్షంలోనే సంబంధిత అధికారితో మాట్లాడి చట్ట ప్రకారం త్వరితగతిన ఫిర్యాదును పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఏవీ.సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాజరు 14.. ఉన్నది 8

మంత్రి ఇలాఖాలో అధికారుల తీరిది

నిడదవోలు, మే 19 (ఆంధ్రజ్యోతి) : సాక్షాత్తూ మంత్రి దుర్గేష్ నియోజకవర్గ కేంద్రమైన నిడదవోలులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యంతో ఉంటున్నారు..ప్రజల సమస్యలు వినేందుకు టైమ్ కేటాయించలేకపోతున్నారు..హాజరు వేయించుకుని వెళ్లిపోయి పనులు చక్కబెట్టుకుంటున్నారు. నిడదవోలు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సుమారు 25 మంది మండలస్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉండగా ఉదయం 10.30 కల్లా 14 మంది అధికారులు హాజరుపట్టీలో సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. తహశీల్దార్ బి.నాగరాజు నాయక్‌తో పాటు మరో ఏడుగురు మాత్రమేపాల్గొన్నారు.అయ్యా మంత్రి వర్యా అధికారుల పనితీరుపై దృష్టి సారించండి



తహశీల్దార్ కార్యాలయ పీజీఆర్ఎస్‌లో మిగిలిన మండలస్థాయి ఉద్యోగులు

సదాశయంతో..

తోటి వారికి సాయపడు.. అన్నది మన సంస్కృతిలోనే ఓ భాగం. మంచి ఆశయంతో పనిచేయడం అంటే మహోపకారం చేసినట్టే. దీనికి ఆగర్భ శ్రీమంతులో, కోట్లకు పడగలెత్తినవారో కానక్కరలేదు. సాటి వారికి కాస్త సాయపడాలనే తపన ఉంటే చాలు. అదే ఎందరికో పెన్నిధి. ఇలా సదాశయంతో తమ వంతు సేవ చేయడానికి సమాజంలో ఎందరో మనకు కనిపిస్తూ ఉంటారు. ఇంత మంచి మనసు ఉన్న కొందరి పరిచయం ఇలా...

మంచి మనసున్న చిరు వ్యాపారి!


రాత్రి సమయంలో ప్రయాణికులకు మంచినీరు అందిస్తున్న ఆంజనేయరెడ్డి


ఆంజనేయరెడ్డిని అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

25 ఏళ్లుగా చలివేంద్రం.. కాకినాడలో ఏడాది పొడవునా నిర్వహణ

ఆయన ఒక చిరువ్యాపారి. రోడ్డు పక్కన ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతూ, తాను సంపాదించిన దాంట్లో కొంత సొమ్మును సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నాడు. సేవా కార్యక్రమాలకు అవరోధంగా మారుతుందని భావించి వివాహం చేసుకోలేదు. ఏడాదిలో 365 రోజులు చలివేంద్రం నిర్వహిస్తూ రెండున్నర దశాబ్దాలుగా ప్రజల దాహార్తిని తీరుస్తున్నాడు. కాకినాడ రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీకి చెందిన అనపాల ఆంజనేయరెడ్డి రోడ్డుపక్కన ప్లాస్టిక్ సామాన్లు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. తాను సంపాదించిన ఆదాయంలో సగభాగం సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నాడు. తొలుత 2000 ఏప్రిల్ నెలలో కాకినాడ మెయిన్‌రోడ్డులో కోటయ్య స్వీట్‌స్టాల్ పక్కన దాతల సహకారంతో స్వచ్ఛంద సంస్థ పేరుతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. ఆ వేసవిలో రెండునెలలపాటు ఆయన మజ్జిగ, మంచినీరు, నిమ్మరసం ప్రయాణికులకు పంపిణీ చేశారు. ఇక 2001 నుంచి 2016 వరకు కాకినాడ మెయిన్‌రోడ్డుతోపాటు జీజీహెచ్ వెలుపల వరకు చలివేంద్రం నిర్వహించారు. 2017 నుంచి రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ కనకదుర్గాదేవి ఆలయం వద్ద మెయిన్‌రోడ్డులో చలివేంద్రం నిర్వహిస్తున్నారు. ఏడాది పొడవునా చలివేంద్రం నిర్వహిస్తుండడం విశేషం. దీనికి నెలకు రూ.6 వేలు వెచ్చిస్తారు. కాకినాడ-పిఠాపురం మార్గంలో వెళ్లేవారు ఇక్కడ మంచినీరు తాగి దాహార్తిని తీర్చుకుంటున్నారు. వేసవిలో మాత్రం మజ్జిగ సరఫరా చేస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఇటీవల మంత్రి కందుల దుర్గేష్ నుంచి ఉగాది నంది పురస్కారం అవార్డు అందుకున్నారు. ఆంజనేయరెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి సిటీకి పనుల నిమిత్తం వచ్చినవారు వేసవిలో తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందిని గుర్తించి తొలుత స్నేహితుల ప్రోత్సాహంతో చలివేంద్రం ఏర్పాటుచేశానని, తర్వాత నుంచి తన పేరుతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి చలివేంద్రం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

- సర్పవరం జంక్షన్/ఆంధ్రజ్యోతి

అమ్మానాన్నలకు ప్రేమతో.. ఓ ఆటోడ్రైవర్!

కరపలో నాలుగేళ్లుగా చలివేంద్రం.. తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా నిర్వహణ

వేసవికాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం చూస్తుంటాం. దాతల సహకారంతో కొన్నిరోజులు లేదా నెలలపాటు అవి నడుస్తుంటాయి. కాకినాడ జిల్లా కరప మండలం కరప గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ చోడపునీడి శ్రీను (నూతన్) నాలుగేళ్లుగా స్థానిక బజార్‌సెంటర్‌లో చలివేంద్రాన్ని నిర్వహిస్తూ ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నాడు. సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన శ్రీను ఆటో నడుపుకుంటూ నిర్విరామంగా చలివేంద్రాన్ని కొనసాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తన తల్లిదండ్రులు చోడపునీడి సత్తిరాజు, సత్యవతిల జ్ఞాపకార్థం కరప బజార్‌సెంటర్‌లో నాలుగేళ్లుగా ఈ చలివేంద్రాన్ని కొనసాగిస్తున్నానని, గత ఉగాది నుంచి కరప-పెనుగుదురు ప్రధాన రహదారిలో మరో చలివేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశామని శ్రీను తెలిపారు. తనకెంతో సంపాదించి ఇచ్చిన తల్లిదండ్రులకు ఏమీ చేయలేకపోయానని, కనీసం వారి పేరున చలివేంద్రాలను పెట్టి కొంతైనా వారి రుణం తీర్చుకోవాలనేది అభిమతమని చెప్పారు. - కరప/ఆంధ్రజ్యోతి


కరప బజారు సెంటర్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రం




అర్తమూరుకు చెందిన యువతికి పెళ్లికోసం సామగ్రి అందిస్తున్న జంబయ్య.. అగ్నిప్రమాదంలో సర్వం పోగొట్టుకున్న కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న దృశ్యం.. తాపేశ్వరం-రామవరం పంటకాల్వపై జంబయ్య తన సొంత నిధులతో నిర్మించిన కాలిబాట వంతెన

సామాన్యుడు... దాతృత్వంలో సంపన్నుడు!

సేవా కార్యక్రమాలకు ముందుంటున్న ఉప సర్పంచ్ కర్రి జంబయ్య


గ్రామంలో వృద్ధ దంపతులకు ఇంటిని నిర్మించిన జంబయ్య

అతడో సామాన్యుడు.. కానీ ఆపన్నహస్తం అందించడంలో మనసున్న వ్యక్తి.. తన సంపాదనలో కొంత సమాజానికి కేటాయించాలన్న తలంపుతో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, గ్రామ ఉపసర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి(జంబయ్య) తన సొంత నిధులతో గ్రామంలో నూతనంగా నిర్మించిన షిర్డిసాయిబాబా ఆలయంలో పాలరాతి విగ్రహాన్ని అందించారు. తాపేశ్వరం నుంచి రామవరం వెళ్లే పంటకాల్వపై జంబయ్య తన సొంతనిధులు రూ.1.5లక్షలతో కాలిబాట వంతెన నిర్మించి ప్రజలు కష్టాలు తీర్చారు. గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చిరువ్యాపారికి తన వంతుగా రూ.50 వేలు సాయం అందించి దాతృత్వం చూపారు. నిరుపేద యువతికి పెళ్లికి అవసరమైన సారె, నగదును అందించి ఉదారతను చాటుకున్నారు. ఉన్నతవిద్య చదువుకోలేని నిరుపేద విద్యార్థులకు తనవంతు సాయం అందిస్తున్నారు. అలాగే అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో ఆయన ముందు వరుసలో ఉంటున్నారు. గ్రామానికి చెందిన వృద్ధ దంపతుల ఇల్లు శిథిలావస్థకు చేరి వారిని చూసేవారు లేకపోవడంతో ఆయన తన సొంత నిధులతో వారికి ఇల్లు నిర్మించి వారి పట్ల తన ప్రేమను చాటుకున్నారు. కులమతాలకు అతీతంగా పేదల కష్టం తన కష్టంగా భావించే ఆయన ఉప సర్పంచ్‌గా, గ్రామంలో కనకదుర్గ ఆలయ కమిటీ ఛైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

- మండపేట/ఆంధ్రజ్యోతి


నిత్యావసర వస్తువులు అందజేస్తున్న వలంటీర్లు




పథకం ప్రారంభం సందర్భంగా నిత్యావసర వస్తువులు అందచేస్తున్న పోలిశెట్టి శేఖర్

ఆపదలో ఆసరాగా..

'డొక్కాసీతమ్మ ఆసరా' పేరుతో సేవలందిస్తున్న జనసేన రామచంద్రపురం ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్

ఆపదలో ఆదుకునేవారు అరుదుగా కనిపిస్తారు.. అలాంటి సమయంలో పేద దళిత కుటుంబాలను ఆదుకోవాలనుకున్నారు జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్.. కుటుంబ సభ్యులు మరణించిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలరోజులకు సరిపడా నిత్యావసరాలు అందిస్తూ నిరుపమానసేవకు శ్రీకారం చుట్టారు.. దానికి డొక్కాసీతమ్మ ఆసరా పథకంగా నామకరణం చేశారు.. తన తల్లి, తండ్రి పేరుతో పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఈ పథకాన్ని 2023, జనవరి 1న ప్రారంభించారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం పట్టణం, మండలంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో ఐదేళ్ల వయస్సు పైబడి ఎవరు మరణించినా వారి కుటుంబానికి నెలరోజులకు సరిపడా 26 కిలోల బియ్యం, కందిపప్పు,నూనె, పంచదార, మినపప్పు, పెసరపప్పు, టీపొడి, ఇడ్లీరవ్వ, కరాచీ రవ్వ, మసాలా దినుసులతో 10 రకాల కిరాణా సరుకులు, 10 కిలోల కూరగాయలు అందజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో మరణించిన వారి కుటుంబాల వివరాలు వలంటీర్ల ద్వారా సేకరిస్తారు. ప్రతి బుధవారం కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు రామచంద్రపురం నియోజకవర్గంలో 1400 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ పథకానికి నియోజకవర్గ ట్రస్టు కోఆర్డినేటర్‌గా తోటపేట శివారు గాంధీనగర్‌కు చెందిన గుబ్బల శ్రీనివాసరావు పనిచేస్తున్నారు. పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ తన తల్లి పోలిశెట్టి లక్ష్మీకాంతానికి ఆకలిగా ఉన్నవారిని ఆదుకోవడం, తండ్రి సుబ్బారావుకు కష్టపడే తత్వం ఉండేదన్నారు. వారి ప్రభావంతోపాటు అభిమాన నటులు చిరంజీవి, పవన్‌కల్యాణ్ సేవలు స్ఫూర్తిగా నిలిచాయని, కొంతైనా పేదలకు సాయం చేయాలని నిత్యావసరాలు అందజేస్తున్నట్టు చెప్పారు. తన సోదరుడు ఫౌండేషన్ వైస్‌ఛైర్మన్ పోలిశెట్టి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు సహకారం అందిస్తున్నారన్నారు. - ద్రాక్షారామ/ఆంధ్రజ్యోతి


సెట్ కోడ్ విడుదల చేస్తున్న ఏపీఈఏపీసెట్ ఛైర్మన్, ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్

ఏపీఈఏపీసెట్ ప్రారంభం

ఉమ్మడి 'తూర్పు'లో తొలి రోజు 9 కేంద్రాల్లో రెండు సెషన్లలో నిర్వహణ

92.03 శాతం హాజరు నమోదు: ఛైర్మన్ ప్రసాద్, కన్వీనర్ సుబ్బారావు వెల్లడి

జేఎన్టీయూకే, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఏపీఈఏపీసెట్ సోమవారం ప్రారంభమైంది. తొలి రోజు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగిందని ఏపీఈఏపీసెట్ ఛైర్మన్, జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. కన్వీనర్ వీవీ సుబ్బారావు, సహ కన్వీనర్లు, కో-ఆర్డినేటర్లు, టీసీఎస్, ఏపీ ఆన్‌లైన్ అధికారులతో కలిసి వీసీ ప్రసాద్ అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష సెట్ కోడ్‌ను వర్సిటీలోని ఈఏపీసెట్ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. మూడు జిల్లాల్లోని 9 కేంద్రాల్లో రెండు సెషన్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు.

● కాకినాడ జిల్లాలోని ఐదు కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 922 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 844 మంది హాజరు కాగా 78 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 923 మంది విద్యార్థులకు 869 మంది హాజరు కాగా 54 మంది పరీక్ష రాయలేదు. మొత్తం రెండు సెషన్లకు కలిపి 1,845 మందికి 1,713 మంది హాజరు కాగా 132 మంది గైర్హాజరయ్యారు. 92.85 శాతం హాజరు నమోదైంది.

● తూర్పు గోదావరి జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లకు కలిపి మొత్తం 1,300 మంది అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1,204 మంది హాజరుకాగా 96 మంది గైర్హాజరయ్యారు. 92.65 శాతం నమోదైంది.

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లలో నిర్వహించిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 803 మంది విద్యార్థులకు 759 మంది హాజరయ్యారు. 44 మంది పరీక్ష రాయలేదని తెలిపారు. 94.52 శాతం హాజరు నమోదైంది. మంగళవారం కూడా అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరుగుతాయని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు.


ఈవోకు బంగారు పంచపాత్రలు, వెండి పళ్లెం సమర్పిస్తున్న దాతలు

వాడపల్లి వెంకన్నకు రూ.22 లక్షల విలువైన బంగారు వస్తువుల సమర్పణ

ఆత్రేయపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి దాతలు రూ..22 లక్షలు విలువైన బంగారు వస్తువులను సమర్పించారు. కొత్తపేట మాజీ ఎమ్మెల్యే మంతెన సుబ్బరాజు వంశవారసులు వెంకటకృష్ణంరాజు-దుర్గావతి దంపతుల కుమారుడు వెంకటసూర్యసుబ్బరాజు-శ్వేత దంపతులు స్వామివారికి 209.84 గ్రాములతో బంగారు పంచపాత్రలు, 318.84 గ్రాములతో వెండి పళ్లెం చేయించారు. సోమవారం వాటిని ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావుకు అందచేశారు. సంప్రోక్షణ అనంతరం స్వామివారి సేవకు వినియోగించారు. దాతలకు



ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు దాత కుటుంబ సభ్యులకు అందజేశారు.


సాధించిన బంగారు పతకాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు చూపిస్తున్న లోవరాజు

ఉషు జాతీయ స్థాయి పోటీలకు లోవరాజు ఎంపిక

కరప, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం జి.బావారం గ్రామానికి చెందిన యు.లోవరాజు జాతీయ స్థాయి ఉషు పోటీలకు ఎంపికైనట్టు ఉషు క్రీడ జిల్లా కార్యదర్శి ఆర్.సుందరం తెలిపారు. కర్నూలు జిల్లాలో ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు జరిగిన 12వ రాష్ట్ర ఉషు చాంపియన్‌షిప్ సీనియర్స్ విభాగంలో లోవరాజు 80 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు. ప్రతిభ కనబరిచిన అతడు త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా లోవరాజు సోమవారం కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బంగారు పతకం చూపించగా ఆయన అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లోవరాజును జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆఫీసర్ బి.శ్రీనువాసకుమార్, రాష్ట్ర ఉషు కార్యదర్శి బి.నరసింహరావు, జి.బావారం సర్పంచ్ రొక్కాల గణేష్, ఉప సర్పంచ్ వై.రామకృష్ణ, యండమూరు స్కూల్ కమిటీ ఛైర్మన్ పి.శ్రీనివాస్ అభినందించారు.

22న హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ

సామర్లకోట, మే 19 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ శోభాయాత్ర కమిటీ సామర్లకోట-పెద్దాపురం పట్టణ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 22న హనుమాన్ శోభాయాత్ర పేరిట భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు శోభాయాత్ర కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు సామర్లకోట ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ సామర్లకోట, పెద్దాపురం వీధుల్లో కొనసాగుతుంది. శృంగవృక్షం దత్త పీఠాధిపతి శ్రీసాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అనుగ్రహభాషణ చేస్తారన్నారు.



ఆపద తొలగింది!

కాకినాడలోని కొండయ్యపాలెం బ్రిడ్జి వద్ద అపార్ట్‌మెంట్ల సమీపంలో విద్యుత్ స్తంభానికి ఓ మొక్క పాదులా అల్లుకుంది. దీంతో విద్యుత్ ప్రమాదం పొంచి ఉందంటూ ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి'లో చిత్రం వచ్చింది. దీనికి అధికారులు స్పందించి సోమవారం ఆ మొక్కను తొలగించారు.

- ఫొటోగ్రాఫర్, కాకినాడ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్




కాకినాడ డీఆర్వో వెంకట్రావుకు వినతిపత్రం ఇస్తున్న వెంకటరామానాయుడు-సత్యవతి దంపతులు

'కబ్జాదారుల చెర నుంచి మా స్థలాలను విడిపించండి'

కాకినాడ/కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గైగోలుపాడులోని తమ స్థలాలను వైసీపీ నాయకులు కబ్జా చేశారని, వారి చెర నుంచి విడిపించాలని ఎయిర్‌ఫోర్స్ విశ్రాంత ఉద్యోగి, తూర్పు గోదావరి జిల్లా దివాన్ చెరువుకు చెందిన కొత్తపల్లి వెంకటరామానాయుడు-సత్యవతి దంపతులు కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో విన్నవించారు. తాను ఉద్యోగంలో ఉండగా 350 గజాల చొప్పున కొనుగోలు చేసిన రెండు స్థలాలు ఆక్రమణకు గురవ్వడంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి వెంకటేశ్వరరావులను కలిసి వివరించామన్నారు. సోమవారం కాకినాడ ఎస్పీ బిందుమాధవ్‌తో పాటు కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారి వెంకట్రావుకు వినతిపత్రాలు అందజేశామని వివరించారు. కాగా ఈ వ్యవహారంపై కలెక్టర్ షాన్‌మోహన్ స్పందించి విచారణకు ఆదేశించారు. కబ్జాకు గురైన స్థలాన్ని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర సోమవారం రాత్రి పరిశీలించారు.

వచ్చేస్తోంది.. మరో హై..వే!

- ఖమ్మం నుంచి దేవరపల్లి ఎన్‌హెచ్-365 బీజీ
- జూన్ నాటికి పూర్తిచేయాలని ప్లాన్
- ఇప్పటికే దేవరపల్లి వద్ద టోల్‌ప్లాజా సిద్ధం
- పొంగుటూరు వద్ద 11 హెక్టార్ల భూ సమస్య
- దగ్గర దారికి కోర్టు అడ్డంకి
- 3 కి.మీ మేర ఆగిన పనులు
- ఆగస్టు 15న ప్రారంభించే ఆలోచన



దేవరపల్లి వద్ద సిద్ధం చేసిన టోల్‌ప్లాజా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మరో కొత్త జాతీయ రహదారి వస్తోంది.. కేవలం ప్రారంభానికి మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అయితే చిన్న సమస్య కారణంగా నేటికీ ఆరంభానికి నోచుకోలేదు.. ఆ సమస్య పరిష్కారమైతే విజయవాడ వెళ్లినంత ఈజీగా హైదరాబాద్‌కు వెళ్లవచ్చు. ఖమ్మం నుంచి దేవరపల్లి మండలంలోని దేచర్ల వరకూ భారత మాల ఆర్థిక నడవా పథకం కింద నాలుగు వరుసల జాతీయ రహదారి(ఎన్‌హెచ్)- 365బీజీ పేరుతో ఓ గ్రీన్‌మార్గం నిర్మాణం అవుతోంది. రహదారి పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. జూన్ నాటికి ఇది పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. ఆగస్టులో ఈ జాతీయ రహదారిని జాతికి అంకితం చేయాలనే ఆలోచనతో ఉన్నారు. ఇంత పెద్ద జాతీయ రహదారికి కేవలం మూడు కిలోమీటర్ల మేర 11 హెక్టార్ల భూ సేకరణ వివాదంగా మారింది. సదరు భూయజమానులు కోర్టును ఆశ్రయించడంతో అక్కడ వివాదం కొనసాగుతోంది. ఈ మూడు కిలోమీటర్ల మేర తప్ప మిగతా హైవే నిర్మాణం సుమారుగా పూర్తయినట్టే. హైదరాబాద్ నుంచి విశాఖ, కలకత్తా వైపు వెళ్లేవారు విజయవాడ మీదగా వెళ్లాలంటే 670 కిలోమీటర్లు హైవేలో 12 గంటల ప్రయాణించాల్సి వస్తుంది. చాలా మంది ఖమ్మం మీదగా కొవ్వూరు- రాజమహేంద్రవరం ఫోర్త్ బ్రిడ్జి మీదగా దగ్గర దారి కోసం పయనిస్తూ ఉంటారు. ప్రస్తుతం గుండుగొలను, నల్లజర్ల, కొవ్వూరు మీదుగా వెళ్లడం వల్ల కొంత దూరం తగ్గింది. ఖమ్మం నుంచి రావడం వల్ల మరింత దూరం తగ్గుతుంది. కేవలం 550 కిలోమీటర్ల మేర పయనిస్తే ఎనిమిది గంటల్లో హైదరాబాద్ చేరుకోవచ్చు.దీనికోసం ఖమ్మం నుంచి దేవరపల్లి మండలంలోని దేచర్ల వరకూ 165 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల జాతీయ రహదారిని భారతమాల ఆర్థిక నడవా పథకం కింద ఎన్‌హెచ్ -365బీజీ పేరుతో నిర్మిస్తున్నారు. దీనివల్ల హైదరాబాద్ విశాఖపట్నం మధ్య 120 కిలోమీటర్ల దూరం తగ్గిపోతుంది. సుమారు రూ.3,573 కోట్ల ఖర్చుతో 165 కిలోమీటర్ల మేర దీనిని నిర్మిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో ఐదు ప్రాజెక్టుల కింద పనిజరుగుతుంది. 117 అండర్ పాసులు, 33 కల్వర్టులు, 9 భారీ వంతెనలు నిర్మాణం వేగంగా జరుగుతున్నాయి. దేవరపల్లి వద్ద టోల్‌ప్లాజా కూడా ఏర్పాటు చేశారు. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకూ కేవలం కొయ్యలగూడెం పరిధిలోని పొంగుటూరులో మూడు కిలోమీటర్ల మేర తప్ప, మిగతా హైవే అంతా సుమారుగా పూర్తయిపోయింది.

కోర్టు సమస్య త్వరగా పరిష్కరించాలి..

మంచి పనులకు కూడా కొన్ని సమస్యలు వస్తుంటాయి. అలాంటపుడు ప్రభుత్వం, అధికారులు సీరియస్‌గా తీసుకుని వాటిని పరిష్కరించి ముందుకు సాగాలి. ప్రజాప్రతినిధులు కూడా స్థానికంగా ఇటువంటి సమస్యలు పరిష్కరించడంపై దృష్టిపెట్టాలి. కొయ్యలగూడెం సమీపంలోని పొంగుటూరుప్రాంతంలో మూడు కిలోమీటర్ల మేర 11 హెక్టార్ల భూ సేకరణ సమస్య కోర్టులో ఉంది. కోర్టు తీర్పు రిజర్వులో ఉన్నట్టు అధికారుల కథనం. ఈ తీర్పు వెలువడితేనే ఈ మూడు కిలోమీటర్ల మేర హైవే పనులు ఆరంభమవుతాయి. ఆగస్టు 15లోపు పూర్తి చేయాలనే ఆలోచనతో ఉన్నా అది సాధ్యపడేదిగా కనిపించడంలేదు. కోర్టు అనుమతి ఇవ్వాలి. భూసేకరణ ప్రక్రియ పూర్తికావాలి. పనులు చేపట్టాలి. మూడు కిలోమీటర్ల మేర నాలుగు వరసల హైవే నిర్మాణం అంటే కొంత సమయం పడుతుంది. ఇక ఆగస్టు అంటే కేవలం మూడునెలలు మాత్రమే సమయం ఉంది. కాని యంత్రాంగం ఈ పనులు త్వరగా పూర్తి చేసేలా ప్రయత్నం చేయవలసిందే. మూడు కిలోమీటర్ల మేర ఏర్పడిన సమస్యను యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇండియన్ ఫారెస్టు సర్వీస్‌కు లవకుమార్ ఎంపిక



రౌతులపూడి, మే 19 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మండలం మూలగపూడి గ్రామానికి చెందిన చింతకాయల లవకుమార్ ఇండియన్ ఫారెస్టు సర్వీస్‌కు ఎంపికయ్యాడు. ఆల్ ఇండియాలో 49 ర్యాంకు సాధించాడు. పశువైద్యుడిగా పనిచేస్తూ మొదటిసారి సివిల్స్ పరీక్షలు రాసి విఫలం కాగా, రెండో ప్రయత్నం 2024లో పరీక్షకు హాజరై విజయం సాధించాడు. చింతకాయల వీర చక్రవర్తి, వీరవరహాలు దంపతులకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. ఈయన తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తుంటారు. లవకుమార్ పశువైద్యుడిగా పనిచేస్తూ నర్సీపట్నంలో నివాసముంటున్నాడు. ఎటువంటి కోచింగ్ లేకుండానే విజయం సాధించినట్టు ఆయన తెలిపాడు. ఈ సందర్భంగా లవకుమార్‌ను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ ...

టీడీపీ నేత సుబ్రహ్మణ్యం మృతి

- సంతాపం తెలిపిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ



సుబ్రహ్మణ్యం మృతదేహంపై టీడీపీ జెండా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాం అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, టీడీపీ నేత ఎద్దు సుబ్రహ్మణ్యం (35) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈనెల 16వ తేదీ రాత్రి తన బైక్‌పై సుబ్రహ్మణ్యం ఇంటికి వస్తుండగా జల్లూరు సమీపంలో అదుపు తప్పి తీవ్రగాయాలపాలైనట్టు పోలీసులు చెబుతున్నారు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన మృతిపై పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సంతాపం ప్రకటించి, పార్థివదేహంపై టీడీపీ జెండాను కప్పారు.

వ్యభిచార గృహంపై దాడి

- పోలీసుల అదుపులో ఇద్దరు మగవాళ్లు , ముగ్గురు మహిళలు



వివరాలు వెల్లడిస్తున్న దేవరపల్లి సీఐ నాగేశ్వర్ నాయక్

దేవరపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై దాడి చేసి ఇద్దరు మగ, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఫోన్లు, మారుతి బ్రిడ్జ్ కారును స్వాధీనం చేసుకున్నట్టు దేవరపల్లి సీఐ బీ.నాగేశ్వర్‌నాయక్ పేర్కొన్నారు. దేవరపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడిస్తూ... దేవరపల్లిలోని మారుతీనగర్‌లో పెనుగొండ జోగేశ్వరరావు అనే వ్యక్తి ఇంటిలో వ్యభిచారం జరుగుతుందన్న ముందస్తు సమాచారం మేరకు తాను, ఎస్సై వీ.సుబ్రహ్మణ్యం, సిబ్బంది, వీఆర్వోలను తీసుకుని వెళ్లి సోదాలు నిర్వహించగా, ఇద్దరు మగ, ముగ్గురు మహిళలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ క్రమంలో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గత కొంతకాలంగా గోపాలపురం మండలం చిట్యాలకి చెందిన జుట్టా బేబి, దుద్దుకూరుకి చెందిన సిర్రా రవి మహిళలకు వల వేసి వారిని వ్యభిచార కూపంలోకి దింపుతూ, దాంతో వచ్చిన సంపాదనతో విలాసవంతంగా గడుపుతున్నారన్నారు. ఈ కేసులో వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్న బేబి, రవి, విటుడు ఏలూరుకు చెందిన కొళ్ల రవితేజను వ్యభిచారం నేరం కింద అరెస్టు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపుతున్నట్టు చెప్పారు. అలాగే వ్యభిచార గృహంలో దొరికిన ఇద్దరు బాధిత మహిళలను ఏపీ స్టేట్ హోమ్‌కు పంపించేందుకు కోర్టు అనుమతి కోరుతున్నామని సీఐ పేర్కొన్నారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి



గాడి రాకేష్ మృతదేహం

కొవ్వూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన కొవ్వూరు మండలం సీతంపేటలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన గాడి రాకేష్ (17) తన స్నేహితుడితో కలిసి గోదావరిలో స్నానానికి వెళ్లాడు. అయితే నది లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు అందులో మునిగిపోయాడు. తర్వాత తేలడంతో నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కొవ్వూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

దిక్కుతోచని స్థితిలో...

వైట్‌బర్లీ పొగాకు రైతులు

- కొనేవారు లేక ఎదురుచూపు
- మొహం చాటేసిన కంపెనీ అధికారులు



భీమోలులో పంటను చూపుతున్న రైతులు

గోపాలపురం, మే19(ఆంధ్రజ్యోతి): గోపాలపురం మండలంలో వైట్‌బర్లీ పొగాకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొనుగోలుదారుల మాయలోపడి భీమోలు, కరగపాడులో దాదాపు 100 ఎకరాల్లో పంటను సాగుచేశారు. నాట్లు దశలో కొనుగోలు చేస్తామని కంపెనీ ప్రతినిధులు నమ్మబలికారు. అంతేకాకుండా సాగుకు అవసరమయ్యే మందులను కూడా సరఫరా చేశారు.తీరా పంటపూర్తై చేతికి అందివచ్చే తరుణంలో మాట మార్చి కొనుగోలు చేసేందుకు నిరాకరించారు. దీంతో వారంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అధిక మొత్తం పెట్టుబడి పెట్టగా, ప్రస్తుతం కొనేవారులేక అయోమయంలో పడ్డారు. నాట్లుదశలో కిలో రూ.150కి కొనుగోలు చేస్తామని చెప్పి, ఇప్పుడేమో నాణ్యతను బట్టి రూ. 120-150కి కొనుగోలు చేస్తామని చెబుతుండడంతో రైతులు కంగుతిన్నారు. దీంతో భీమోలులోని రైతులు నిరసన వ్యక్తం చేశారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

ఆత్రేయపురం, మే 19(ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆత్రేయపురం ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. వాడపల్లికి చెందిన పెద్దింటి అనురాధకు అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంతో 17ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు. కొంతకాలంగా సుబ్రహ్మణ్యం భార్యను అదనపు కట్నం తేవాలంటూ తరచూ వేధిస్తున్నాడు. ఇంటి నుంచి బయటకు గెంటివెయ్యడంతో అనురాధ పుట్టింటికి వెళ్లి కుటుంబ సభ్యుల సహకారంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము తెలిపారు.

పిఠాపురంలో ఇరువర్గాల ఘర్షణ

ఆరుగురికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

పిఠాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో సోమవారం సాయంత్రం రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన మిరియాల సూర్యకుమారి ఇంటిని ఇటీవల అధికారులు కూల్చివేశారు. ఈ విషయంపై ఇంటి ఎదురుగా ఉన్న కొల్లి సత్తిబాబు, అతడి కుటుంబసభ్యులు, సూర్యకుమారి కుటుంబసభ్యుల మధ్య వివాదం చోటుచేసుకుంది. వివాదం ముదిరి ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో ఒక వర్గానికి చెందిన ముగ్గురు, మరో వర్గానికి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిఠాపురం పట్టణ పోలీసులు ఇరువర్గాల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు అదృశ్యమయ్యారని పోలీసులు తెలిపారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.. స్థానిక సావిత్రి నగర్‌కు చెందిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఈనెల 18వ తేదీ ఉదయం 11గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడం, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె భర్త బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. అలాగే స్థానిక కంబాలపేటకు చెందిన ఎస్.భీమరాజు అనే మెకానిక్ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య ప్రియదర్శిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐబీఎంతో జీజీయూ ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

రాజానగరం, మే 19(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ), ప్రపంచ ఐటీ దిగ్గజ సంస్థ ఐబీఎంతో అవగాహన ఒప్పందం(ఎంవోయూ)చేసుకున్నట్టు జీజీయూ ప్రోచాన్సలర్ కె.శశికిరణ్ వర్మ తెలిపారు. ఐబీఎం ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ బిజినెస్ డెవలప్‌మెంట్ అండ్ క్లైంట్ రిలేషన్‌షిప్ లీడర్ హరిరామ సుబ్రహ్మణియన్, డెలివరీ హెడ్ వికారుద్దీన్‌తో కలిసి సోమవారం జీజీయూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎం వోయూ కారణంగా భవిష్యత్తులో జీజీయూ, ఐబీఎం మధ్య విద్యా సహకారం అనే థీమ్ కింద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ అండ్ డేటా సైన్స్ ప్రోగ్రాం ప్రారంభాన్ని సూచిస్తుందన్నారు. ఐబీఎం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జీజీయూతోనే ఎంవోయూ చేసుకుందన్నారు. ఈ రెండూ ఉమ్మడిగా కోర్సులను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బోధిస్తుందని, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, లైవ్ ప్రాజెక్టు, ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. దీనిలో భాగంగా జీజీయూ ఐబీఎం అధికారులు పరస్పరం ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. సమావేశంలో జీజీయూ వైస్ ఛాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రోఛాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ది ఫర్నల్ స్టోరీ సంస్థ వ్యవస్థాపకుడు, ఎండీ సుమంత్ పాలేపు పాల్గొన్నారు.

ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతిగా ముత్యాలనాయుడు



ముత్యాలనాయుడును కలిసిన స్థానిక శాస్త్రవేత్తలు

అంబాజీపేట, మే 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతిగా డాక్టర్ ఎం.ముత్యాలనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పనిచేసిన అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు వెంకటరామన్నగూడెం వైఎస్సార్ ఉద్యాన సమాచార కేంద్రానికి బదిలీ అయ్యారు. దీంతో కర్నూలు జిల్లా నంద్యాలలోని మహానంది ఉద్యాన పరిశోధన కేంద్రం ఉద్యాన పరిశోధన కేంద్రం నుంచి ముత్యాలనాయుడు బదిలీపై అంబాజీపేట వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ పంటలలో వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కొబ్బరిని ఆశించి నష్టాన్ని కలుగ చేస్తున్న తెల్లదోమ నివారణకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడును స్థానిక శాస్త్రవేత్తలు గోవర్ధనరావు, కిరిటీ, నీరజ, అనూష, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి





మృతుడు గంధం నాగేశ్వరరావు, ఫైల్‌ఫొటో

కొత్తపేట, మే 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్లో ఆర్టీసీ బస్సు వ్యక్తిని నేరుగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన్నట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. వాడపాలేనికి చెందిన గంధం నాగేశ్వరరావు(37) బంధువుల ఇంట పెళ్లికి కొత్తపేట బస్టాండ్ సమీపంలో ఉన్న హరిహర దేవాలయ ప్రాంగణానికి వెళ్లాడు. ఆదివారం రాత్రి 11గంటల సమయంలో అమలాపురం నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా నాగేశ్వరరావును ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మృతుడు భార్య గంధం దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేంద్ర తెలిపారు. కాగా కుటుంబాన్ని పోషించే భర్త ఇలా రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో భార్య దుర్గ విలపించిన తీరు అందర్ని కలిచివేసింది.

అనపర్తిలో ఆటోను ఢీకొన్న బైక్

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ యువకులు

అనపర్తి, మే 19(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని కుమ్మరి వీధిలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తి మండలం పీరా రామచంద్రపురం గ్రామానికి చెందిన లంక మనోహర్, కోడి ప్రదీప్ అనపర్తిలోని పాత హరిజన పేటలో తమ బంధువుల ఇంటికి మోటార్‌సైకిల్‌పై వచ్చారు. తిరుగు ప్రయాణమైన వీరు కుమ్మరి వీధిలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొని రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సారాను తరలిస్తున్న ఇద్దరి అరెస్టు చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరం సంజీవయ్యనగర్ సమీపంలో సోమవారం 10లీటర్ల సారాతో వెళ్తున్న పి.జోసెఫ్‌ను, మూలగొయ్యి సమీపంలో 10లీటర్ల సారాతో వెళ్తున్న కె.ప్రసాద్‌ను త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి 20లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

మురికిని మురికితోనే..

ముల్లును ముల్లుతోనే తీయాలనే నానుడి అందరికీ తెలిసే ఉంటుంది. ఇక్కడ ఉన్న ఫొటోలకు ఈ నానుడి సరిగ్గా సరిపోతుంది అనుకుంటా.. పవిత్రమైన గోదావరి నది కాలుష్యం బారిన పడుతోంది. పుణ్య స్నానాలకు వచ్చిన భక్తులు విడిచిన బట్టలు, ఇతర వ్యర్థాలతో కలుషితం అవుతోంది. అయినా పట్టించుకునే నాథుడే లేడు. ఇదిలా ఉంటే ఇక్కడ బట్టలు ఉతికే ఆవిడను చూడండి! మురికి పట్టిన బట్టలను తెచ్చి మురికి నీళ్లలో ముంచి, బండకేసి బాది, గట్టిగా పిండి ఎండలో ఆరబెట్టింది. చివరి ఫొటోను చూశారా! ఎండలో ఆరబెట్టిన బట్టలు ఎలా తలతలా మెరిసిపోతున్నాయో! ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్టు.. మురికిని మురికితోనే పోగొట్టాలనుకుంటా!

-ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం.



రాజమహేంద్రవరం

ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మితే చర్యలు

లీగల్ మెట్రాలజీ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు

రాజమహేంద్రవరం అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఏ వస్తువునైనా ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మితే కేసు నమోదు చేస్తామని లీగల్ మెట్రాలజీ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు అన్నారు. లీగల్ మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి వినియోగదారుడు తాము కొనుగోలు చేసిన వస్తువు ధర, తయారీ తేదీ, నాణ్యత వంటి విషయాలను అడిగి తెలుసుకోవాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. 1915 టోల్‌ఫ్రీ నెంబరుకు కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆర్టీసీ డీఎం షేక్ షబ్నం, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ లోపల షాపులను తనిఖీ చేసి ఆహార పదార్థాలు, ఇతర వస్తువుల విక్రయ ధరలను పరిశీలించారు. కార్యక్రమంలో లీగల్‌మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివబాలాజీ, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌బాబు పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డి సేవలు చిరస్మరణీయం

అనపర్తి, మే 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా, భారత రాష్ట్రపతిగా నీలం సంజీవరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా రామవరంలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే నల్లమిల్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా, రెండు పర్యాయాలు లోక్‌సభ స్పీకరుగా పనిచేసిన సంజీవరెడ్డి అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని, ఆయన సేవలు ఎన్నటికీ మరువలేనివాని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కులాన్ని
ఆపాదించడం సరికాదు

బద్దె జార్జి ఆంటోని

రాజమహేంద్రవరం సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా కులాన్ని ఆపాదించి దళిత న్యాయమూర్తి అని కొందరు సంబోధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బద్దె జార్జి ఆంటోని అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉన్నత ఉద్యోగాలు, పదవుల్లో ఉన్న వారి కులాలను ఎత్తిచూపడం వారి వ్యక్తిగత విలువలను అగౌరవపరచడమేనన్నారు. గతంలో నన్నయ యూనివర్శిటీ వీసీ విషయంలోకూడా కొంతమంది సోషల్ మీడియాలో ట్రోల్ చేశారని, ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గోవాయి విషయంలోను దళిత న్యాయమూర్తి అని పిలుస్తున్నారని, ఇది సరికాదన్నారు. ఒక రకంగా ఇది కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ లోకి వస్తుందన్నారు. మిగిలిన వారు ఉన్నత పదవులు అధిరోహించినప్పుడు ప్రస్తావనకు రాని కులం దళిత, గిరిజనులు చేపట్టినప్పుడు ఎందుకు వస్తుందని ఆయన ప్రశ్నించారు. ఇది సరియైన విధానం కాదన్నారు.

స్థలాలకు ఎన్‌వోసీలు ఇప్పించండి


వృద్ధురాలి నుంచి అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

- పీజీఆర్ఎస్‌లో కమిషనర్‌కు అర్జీ పెట్టుకున్న బాధితులు
- అర్జీలను గడువు లోపు పరిష్కరించండి: కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం భాస్కర్‌నగర్‌కు చెందిన లేఅవుట్‌లో స్థలాలు కొనుగోలు చేసిన కొందరు వాటికి ఎన్‌వోసీలు ఇవ్వాలని కోరుతూ కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్‌కు అర్జీపెట్టుకున్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో స్థల యజమానులు బి.జార్జిఆంటోని, పచ్చిపాల పుత్రయ్య కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆంటోని మాట్లాడుతూ తాను ఎస్‌బీఐ రిటైర్డ్ ఉద్యోగినని, పదవి విరమణ సమయంలో వచ్చిన సొమ్ముతో భాస్కర్ నగర్‌లో సర్వేనెంబరు 121/1లో 112 గజాల స్థలాన్ని కొనుగోలు చేశానన్నారు. దాంట్లో గృహ నిర్మాణం కోసం లిక్విడేటర్ ద్వారాడివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసరుకు అర్జీ పెట్టగా దీనిపై సబ్ రిజిస్ట్రార్ నుంచి సమాచారం అందవలసివుందని చెప్పి మమ్మల్ని కూడా వార్కి అర్జీ పెట్టమని చెప్పారు. ఈసీ కోరగా దాని రికార్డు బ్రిటిల్ అయిపోయిందని ఇచ్చారన్నారు. ఈ విషయంలో లిక్విడేటర్‌ను సంప్రదించగా తమ నెంబరుతో వేరే అనధికార నెంబరు 2207తో లింక్ అయ్యి ఉందని అని చెప్పి దీనిపై చర్య తీసుకోకుండా మమ్మలనే వేదనకు గురిచేసి హైకోర్టుకి వెళ్ళమని సలహా ఇస్తున్నారన్నారు. తనకు ఎన్‌వోసీ ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. అదే లేఅవుట్‌కు చెందిన పచ్చిపాల పుత్రయ్య కూడా కమిషనర్‌కు అర్జీ పెట్టుకున్నారు. భాస్కర్‌నగర్‌లో దొంగలు కొందరు చేసిన పనికి కష్టపడి కొనుగోలు చేసిన తమ భూములకు ఎన్‌వోసీలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పీజీఆర్ఎస్‌కు 27 అర్జీలు

కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో కమిషనర్ కేతన్ గార్గ్ ప్రజల నుంచి 27 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు 3 అర్జీలు, టౌన్ ప్లానింగ్‌కు 5, ఇంజినీరింగ్ శాఖకు 9, వార్డు సచివాయాలకు 8, పబ్లిక్ హెల్త్‌కు 1, మెప్మాకు 1 అర్జీ పింఛన్లు, కుళాయి కనెక్షన్లు, విద్యుత్ పోల్స్ ఏర్పాటు, డోర్ నెంబర్ల మార్పు తదితర సమస్యలపై వచ్చినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలు గడువు లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యటించి పారదర్శకంగా విచారణ జరిపి అర్జీదారుడు సంతృప్తి చెందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

1100కు కాల్ చేయండి: ఆర్డీవో

రాజమహేంద్రవరం అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలు ఉండి కార్యాలయనికి నేరుగా రాలేని ప్రజలు 1100 కాల్ సెంటర్ ఫోన్ చేసి అర్జీలు, ఫిర్యాదులు తెలపవచ్చని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన అర్జీలను డివిజన్ స్థాయి అధికారులతో కలసి ఆయన తీసుకున్నారు. రాజమహేంద్రవరం, రాజానగరం, సీతానగరం మండలాలకు చెందిన పలువురు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను పూర్తిగా పరిశీలించి అర్జీదారులకు పూర్తి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. పలువురు డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీని పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

నేడు కొవ్వూరులో టీడీపీ మినీ మహానాడు

కొవ్వూరు, మే 19(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతిని సందర్భంగా కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం మినీ మహానాడు నిర్వహిస్తున్నట్టు ద్విసభ్య కమిటీసభ్యుడు కంటమణి రామకృష్ణారావు తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో జరుగుతుందన్నారు.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి

రాష్ట్ర ప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రతి పౌరుడు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పని సరిగా చేయించుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. సంక్షేమ పథకాల కోసమే కాకుండా ఆదాయ, కుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిటీ మెంబరు సర్టిఫికెట్, ట్యాక్స్ పేమెంట్, ల్యాండ్ రిజిస్ట్రేషన్లు వంటి ఎటువంటి సేవలు పొందాలన్నా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి అని అన్నారు. తెల్ల రేషన్‌కార్డుదారులతో పాటు ఇతర కార్డుదారులు, ఆర్థికంగా ఉన్నత వర్గాల వారు మ్యాపింగ్ చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ సేవల లబ్ధిని కోల్పోకుండా ఉండేందుకు తమ తమ పరిధిలోని సచివాలయ కార్యాలయాలను సంప్రదించాలని పేర్కొన్నారు.

కార్యకర్తలే టీడీపీ బలం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
- తెలుగుదేశం పార్టీ అనపర్తి, రాజమహేంద్రవరం నియోజకవర్గాల మినీ మహానాడులు
- పలు తీర్మానాలు ఆమోదం

అనపర్తి, మే 19(ఆంధ్రజ్యోతి): దేశంలోనే కార్యకర్తలే బలంగా సాగుతున్న ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశం మాత్రమేనని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. సోమవారం అనపర్తి నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు బిక్కవోలు మండలం బలభద్రపురం ఎమ్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్, మూలారెడ్డి విగ్రహాలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి యర్రా వేణుగోపాల నాయుడు పూలమాలలు వేసి మహానాడును ప్రారంభించారు. ఈ సందర్భంగా పహల్గామ్ దాడిలో మృతి చెందిన వారికి, సరిహద్దులో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్లకు, నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకులకు సభ మౌనం పాటించి నివాళులర్పించింది. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలు అంశాలపై సభలో తీర్మానాలను ప్రవేశపెట్టారు. వేమగిరి కాకినాడ కెనాల్ రోడ్డును అభివృద్ధి చేయాలని సీనియర్ నాయకుడు సిరపల్లి నాగేశ్వరరావు, రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యాన్ని రైతు నచ్చిన చోట అమ్ముకునే విధంగా వెసులుబాటు కల్పించాలని పుట్టా గంగాధర చౌదరి. డెల్టా ప్రాజెక్టు పరిధిలో కాలువలు ఆధునీకరించాలని నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, చాగల్నాడు ఎత్తిపోతల పథకం ద్వారా కాలువలు ఏర్పాటు చేసి పంపింగ్ స్కీమ్‌లో పంపులను మరమ్మత్తులు చేయించి సాగు నీరందించాలని ఆళ్ళ గోవిందు, దివంగత ముఖ్యమంత్రి అన్న ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించాలని వీవీవీ చౌదరి (అబ్బు) చేసిన తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, ఆళ్ళ గోవిందు, జుత్తుగ కృష్ణ, వెలుగుబంటి సత్తిబాబు, జుత్తుగ సూర్యకుమారి, కర్రి శేషారత్నం, నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానాడు విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27 నుంచి మూడురోజుల పాటు జరిగే టీడీపీ మహానాడును విజయవంతం చేయాలని ఆ పార్టీ హెల్త్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిరామ్ కిరణ్ గోరంట్ల పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదేశాల మేరకు సోమవారం రాజమహేంద్రవరంలో రవిరామ్ కిరణ్ ఆధ్వ ర్యంలో రూరల్ నియోజకవర్గ టీడీపీ మహానాడు నిర్వహించారు. దీనికి నియోజకవర్గ పరిశీలకుడు డొక్కా నాథ్‌బాబు విచ్చేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాథ్ బాబు మాట్లాడుతూ కడపలో జరిగే మహానాడుకు రూరల్ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు నాయకులు తరలిరావాలన్నారు. రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో నియోజకవర్గంలోను అభివృద్ధి కుంటుపడిందని, బుచ్చయ్యచౌదరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక సుమారు రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం ఎన్టీఆర్‌కు నివాళి, నియోజకవర్గంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్తలకు నివాళి, అభివృద్ధి పనులు, కడపలో జరిగే మహానాడు విజయవంతం చేయాలనే నాలుగు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మండలాధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, వాసిరెడ్డి రాంబాబు, బోడపాటి గోపి, చెల్లుబోయిన శ్రీను, షేక్ సుభాన్, పండూరి అప్పారావు, గొందేసి మాధవిలత, మణి, తనూజా, ముత్తాబత్తుల విజయ పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రవిరామ్ కిరణ్

ఏపీ ఫైబర్‌నెట్‌పై రివ్యూ మీటింగ్ పెట్టాలి


కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న అపరేటర్లు

కలెక్టరేట్‌లో ఆపరేటర్ల వినతి

కడియం, మే 19(ఆంధ్రజ్యోతి): లక్షలాది సామాన్య ప్రజలకు ప్రాథమిక హక్కుగా నిత్యావసర సేవా కమ్యూనికేషన్ విభాగంలో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకం ఏపీ ఫైబర్‌నెట్ వ్యవస్థ ప్రస్తుత కార్యకలాపాల వ్యవహారంపై సోమవారం కలెక్టర్‌లో ఆపరేటర్లు వినతిపత్రం అందజేశారు. సీఎం చంద్రబాబు తక్షణం రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్టు ఆపరేటర్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ ఫైబర్ సేవలను వారంలో 24గంటలు నిరంతరాయంగా అందించాల్సిన ఏపీఎస్ఎఫ్ఎల్ సంస్థ ను నిత్యం పర్యవేక్షించే విధంగా ఐఏఎస్ అధికారిని ఎండీగా నియమించాలన్నారు. అనుభవజ్ఞులైన సిబ్బందిని నియమించి ఆగిపోయిన టెక్నికల్ సర్వీసెస్, కస్టమర్ కేర్ కాల్ సెంటర్లన్నింటిని పునరుద్ధరించాలన్నారు. ఏపీఎస్ఎఫ్ఎల్ ఫేస్1, బీ బీఎన్ఎల్ ఫేస్2, సర్వర్ల నెట్‌వర్క్‌ల అనుసంధానం ఎన్‌వోసీ/డీ హెచ్‌క్యూ/పీవోపీ లోకేషన్లలో రూటర్ల ఏఎంసీ, యూపీఎస్, బ్యాటరీ, ఓపీజీడబ్ల్యు లింక్, ఇతర యంత్ర పరికరాలను యుద్ధ ప్రాతిపదికన సమకూర్చుకోడానికి అవసరమయ్యే నిధులను విడుదల చేయాలని కోరారు. ప్రజల వద్ద ఉండిపోయిన, కాలం చెల్లిన, నెలవారీ రీచార్జి, ఎస్‌టీబీ బాక్స్‌లపై ఈఎంఐ/రెంటల్ చార్జెస్ రూ.59 మావాలెట్ లోంచి అన్యాయంగా కట్ చేస్తున్నారని, ఆపరేటర్లను ఇబ్బంది పెడుతున్న ఈ విధానాన్ని తీసేసి జీరో వాలెట్ సిస్టం అమలు చేయాలని కోరారు. సెటప్ బాక్సులు తిరిగి ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో గుత్తుల కృష్ణ, కొమ్మోజు వేంకటేశ్వరరావు, అంగర శ్రీనివాస్, పేపకాయల సత్యనారాయణ, ఆర్ఎస్ ప్రసాద్, వాసంశెట్టి రమణ, కె.రాంబాబు,కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కో-ఆప్షన్ మెంబర్‌గా బాజ్జి


బాజ్జికి ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎంపీడీవో

కడియం, మే 19(ఆంధ్రజ్యోతి): కడియం మండల పరిషత్ కో-ఆప్షన్ మెంబర్‌గా కడియపుసావరానికి చెందిన జనసేన నాయకుడు షేక్ బాబ్జి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ ఎన్నికల్లో గెలుపొందిన షేక్ వలీ శ్రీనివాస్ ఇటీవల మృతి చెందడంతో ఈ స్థానం ఖాళీ అయింది. నోటిఫికేషన్ విడుదల కావడంతో ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించాలని కూటమి నాయకులు నిర్ణయించి అభ్యర్థిగా బాబ్జిని ఎంపిక చేయగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాబ్జికి ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, జనసేన,మండల టీడీపీ అధ్యక్షుడు ముద్రగడ జమీ, వెలుగుబంటి నాని, నాయకులు గట్టి నర్సయ్య అభినందనలు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి విగ్రహ పునః ప్రతిష్ఠ

రాజమహేంద్రవరం కల్చరల్, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక 50వ డివిజన్ చౌడేశ్వరీ నగర్లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి, అక్కడ నిర్వహించిన యజ్ఞయాగాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.26 వేలు విరాళంగా అందజేశారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి : నల్లమిల్లి


కొమరిపాలెంలో ఆక్రమణలపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, మే 19(ఆంధ్రజ్యోతి): రైతుకు విత్తనం సరఫరా నుంచి పండించే పంట విక్రయం వరకూ అన్ని విధాల ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన పందలపాక, కొమరిపాలెం గ్రామాల పరిధిలోని కాకినాడ కెనాల్‌లో ఉపాధి కూలీలతో కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సాగు, మురుగునీటి వ్యవస్థలను పూర్తిగా భ్రష్టు పట్టించి, కాలువల్లో పేరుకుపోయిన తూడు, సిల్టును ఐదేళ్లు తీయలేదన్నారు. కూటమి ప్రభుత్వం రూ.400 కోట్లతో వీడ్ రిమూవల్, డీసిల్టింగ్ పనులు చేపట్టిందని, అయితే ఈ మొత్తం సరిపోకపోవడంతో ఉపాధిహామీ, ఇరిగేషన్ నిధులను జోడించి నియోజకవర్గంలోని అన్ని కాలువల్లోను తూడు, సిల్ట్ తొలగింపు చేపట్టామన్నారు. అనంతరం ఆయన కొమరిపాలెంలోని ఆక్రమణలకు గురైన ఆర్అండ్‌బీ పిల్లకాలువను పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పడాల సూర్యనారాయణరెడ్డి, పడాల రాము, దుర్గారెడ్డి, గుణ్ణం శ్రీనివాసచౌదరి, చినబుజ్జి, డీవీఆర్, బోగాధి వెంకటరమణ, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో అగస్టీన్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు తాతారెడ్డి మృతి



బిక్కవోలు, మే 19(ఆంధ్రజ్యోతి): కొంకుదురు గ్రామానికి చెందిన టీడీపీ నేత, ఉపసర్పంచ్ సత్తి తాతారెడ్డి(52) సోమవారం మృతి చెందారు. దీంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్.. తాతారెడ్డి భౌతికకాయంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో వుంటూ ఎన్నో సేవలందించారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, చిన్నం వీరభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై ఎమ్మెల్యే నల్లమిల్లి సమీక్ష

అనపర్తి మే 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలుపై మండలంలోని రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం రాత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు పరిస్థితులపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. బిక్కవోలు మండలానికి సంబంధించి మరింత టార్గెట్ కావాలని అధికారులు వివరించారు. దీనిపై అధికారులతో చర్చించి టార్గెట్ ఇచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి రంగంపేట మండలాల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి వుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఈద్గా, ముస్లిం బరియల్ గ్రౌండ్‌కు అధికారికంగా వేసిన కమిటీలకు సంబంధించిన నియామక పత్రాలను సోమవారం స్థానిక తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో ఆదిరెడ్డి వాసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో వక్ఫ్ ఆస్తులైన ఈద్గా, ముస్లిం బరియల్ గ్రౌండు అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా కమిటీలకు ఆల్‌సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహ్మద్ అబ్దుల్లాతో కలిసి నియామకపత్రాలు అందజేశారు. వైసీపీ పాలనలో ముస్లిం బరియల్ గ్రౌండును పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. గతంలో షాదీఖానాలు, మసీదుల అభివృద్ధికి నిధులు మంజూరై నిలిచిపోయిన వాటికి జీవోలను పునరుద్ధరించి నిధులు తెస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు అబ్దుల్లా, అస్లాం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బషీర్, మహబూబ్ జానీ, మహబూబ్ ఖాన్, ఖాన్ బాబు, అప్సరి, అహ్మదున్నీషా, జనసేన లిమ్రా బాషా, బషీర్, జిలానీ పాల్గొన్నారు.


కమిటీలకు నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

దివాన్‌చెరువు పంచాయతీకి ఎన్నికలు జరపాలి

యాదవ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు

దివాన్‌చెరువు, మే19 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు గ్రామ పంచాయతీ పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని యాదవ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. దివాన్‌చెరువు పంచాయతీకి దాదాపు ఆరేళ్లుగా పాలకవర్గ ఎన్నికలు జరగలేదని, దీంతో పంచాయతీకి ప్రభుత్వం నుంచి రావలసిన ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్నారు. ఈ కారణంగా పంచాయతీ అభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు దివాన్‌చెరువు పంచాయతీకి ఎన్నికలు జరిపేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఎన్నికలు నిర్వహించడం ద్వారా పంచాతీకి ప్రభుత్వ నిధులు విడుదలై అభివృద్ధి పనులు జోరుగా సాగేందుకు సహకరించాలని బత్తుల పేర్కొన్నారు.

కడియంలో తిరంగా యాత్ర



కడియం, మే 19(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో కడియంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో సోమవారం తిరంగా యాత్ర నిర్వహించారు. త్రివిధ దళాలకు మద్దతు పలుకుతూ మృతి చెందిన వీరజవాన్లకు నివాళులర్పించారు. భాస్కర్‌సెంటర్, బుర్రిలంక- కడియం రోడ్డు మీదుగా యాత్ర జరిగింది. కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ మహాసభను జయప్రదం చేయండి

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి విల్సన్‌పాల్.. పోస్టర్ ఆవిష్కరణ


రాజానగరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

రాజానగరం, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో భాగంగా జూన్ 5న విజయవాడలో జరుగునున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర తృతీయ కౌన్సిల్ మహాసభను జయప్రదం చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్‌పాల్ పిలుపునిచ్చారు. కౌన్సిల్ మహాసభ సన్నాహక సమావేశం రాజానగరంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో సోమవారం జరిగింది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విల్సన్‌పాల్ మాట్లాడుతూ కౌన్సిల్ మహాసభకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్‌తో పాటు మరికొందరు మంత్రులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. యూనిట్ అధ్యక్షుడు ఎన్‌వీఎస్‌రాజు మాట్లాడుతూ ఉద్యోగులు ఏడాదిగా ఎదురు చూస్తున్న పెండింగ్ ఐఆర్, పీఆర్సీ ఇతర ఉద్యోగ సమస్యల పరిష్కారంలో భాగంగా ఈ కౌన్సిల్ మహాసభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో యూనిట్ ముఖ్యకార్యదర్శి పి.మురళీకృష్ణ, జె.రాజారావు, టి.శ్రీధర్, ఎస్.మౌర్య, ఎం.సుబ్రహ్మణ్యం, శాంతిరాజు, ప్రకాష్, రాందాస్, అప్పారావు, శంకరరావు పాల్గొన్నారు.

అనపర్తి: స్థానిక ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమానికి ఏపీజీఈఏ జిల్లా ఉపాధ్యక్షుడు రవి కుమార్ విచ్చేసి కౌన్సిల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 5న విజయవాడలో నిర్వహించే ఉద్యోగ సంఘ కౌన్సిల్ సభలో సీఎం చంద్రబాబు పాల్గొంటారని ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారన్నారు. ఈ సమావేశానికి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనపర్తి అధ్యక్షుడు డాక్టర్ తాడి రామగురెడ్డి, కార్యదర్శి ప్రసాద్, సీఎస్ఆర్ఎం వో డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ తరుణ్, పాల్గొన్నారు.


అనపర్తిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

జీవో 4 అమలుపై పునరాలోచన చేయాలి

తహశీల్దార్‌కు వీఆర్వోల వినతి

గోకవరం, మే19(ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 4 అమలుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని మండలంలోని వీఆర్వోలు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దారు సాయి ప్రసాద్‌కు పలు డిమాండులతో కూడిన వినతి పత్రాన్ని వీర్వోలు అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం మండలాధ్యక్షుడు వీరబ్రహ్మ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే పనిభారంతో వీఆర్వోలు సతమతమవుతున్నారన్నారు. అయితే ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో 4తో రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా కలిపి సిబ్బందిని కుదించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ క్లస్టర్ విధానం వల్ల సుమారు 7500 మంది వీఆర్వోలను మిగులు సిబ్బందిగా చూపించి వేరే సచివాలయాలకు సర్దుబాటు చేయనున్నారన్నారు. మొదటి నుంచి రేషనైలేజేషన్ ప్రక్రియలో క్లస్టర్ విధానంలో జరిగే లోపాలను ఇప్పటికే డివిజన్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తీసుకెళ్లామన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక వీఆర్వో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0 (సోమవారం)
కనిష్ఠం : 27.0

వచ్చేస్తోంది.. మరో హై..వే! 8



అనపర్తి మినీ మహానాడులో ఎన్టీఆర్, మూలారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి తదితరులు

మహానాడు జోష్

- నియోజకవర్గాల్లో మినీ మహానాడు
- కేడర్‌లో ఉప్పొంగుతున్న ఉత్సాహం
- 3 నియోజకవర్గాల్లో నిర్వహణ
- నేడు మూడు చోట్ల అమలు
- 22న రాజానగరంలో ఏర్పాట్లు
- కమిటీల నియామకంపై కసరత్తు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

టీడీపీలో మహానాడు జోష్ పెరిగింది. ఇప్పటికే సంస్థాగత ఎన్నికలతో జోరు పెంచిన నేతలు ఇక మహానాడుపై దృష్టి పెట్టారు. ఈ నెల 27,28,29వ తేదీల్లో కడపలో టీడీపీ మహానాడు జరగనున్న సంగతి తెలిసిందే. ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ మహానాడుకు జిల్లా నుంచి నియోజకవర్గాల వారీ తరలివెళ్లడానికి పార్టీ శ్రేణులు సిద్ధం అవుతున్నాయి. మహానాడు నిర్వహణకు ముందు సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయడం టీడీపీ ఆనవాయితీ. మొత్తం కమిటీల పూర్తి చేసిన తర్వాత మహానాడులో పార్టీ అధ్యక్షుడిని లాంఛనంగా ఎన్నుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత నెల 14 నుంచి కుటుంబ సాధికారిత సారథుల నియామకంతో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ మొదలైంది. తర్వాత బూత్, గ్రామ, మండల, పట్టణ, డివిజన్, నియోజకవర్గ, పార్లమెంట్ పరిధి కమిటీలతో పాటు, వాటి అనుబంధ కమిటీల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రాజమండ్రి సిటీ, రూరల్‌లో ఇంచుమించు కమిటీలను నియమించారు. కమిటీల నియామకంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ముందంజలో ఉన్నారు. సిటీలో మొదటగా మినీ మహానాడు నిర్వహించారు. అనపర్తిలో నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీల నియామకం జోరందుకుంది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్‌రెడ్డి టీడీపీ కన్వీనర్‌గా ఉన్నారు. అన పర్తి, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాల మినీ మహానాడు సోమవారం నిర్వహించారు. నిడదవోలు, గోపాలపురం,కొవ్వూరు నియోజకవర్గాల పరిధిలో మంగళవారం మినీ మహానాడు నిర్వహించనున్నారు. రాజానగరం నియోజకవర్గ మినీ మహానాడు ఈ నెల 22వ తేదీన జరగనుంది. రాజానగరంలో సంస్థాగత ఎన్నికలు ఇంకా పూర్తి కాలేదు. ఇక్కడ ఇన్‌చార్జిగా బొడ్డు వెంకటరమణ చౌదరి ఉన్న సంగతి తెలిసిందే. కానీ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా ఉన్న సంగతి తెలిసిందే.ఆయన కుమారుడు అభిరామ్ కూడా ఇక్కడ పార్టీలో పట్టుకోసం ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పదవి లభించడంతో నిడదవోలు టీడీపీలో ఉత్సాహం పెరిగింది. కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం మినీ మహానాడు నిర్వహిస్తారు.గోపాలపురంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో చాలా వరకూ కమిటీల నియామకం పూర్తయింది.ప్రధాన కమిటీలను ప్రకటించాల్సి ఉంది. మంగళవారం మినీ మహానాడు జరగనుంది. జిల్లాలో సంస్థాగత ఎన్నికలకు సంబంధించి చాలా చోట్ల పాతనేతలకే పదవులు దక్కగా కొద్దిగా కొత్త ముఖాల ప్రాధాన్యత ఇచ్చారు. అయితే టీడీపీకి పూర్వం నుంచి అభిమానులుగా ఉన్న చాలా కులాలకు కనీస ప్రాధాన్యత ఇచ్చి, పార్టీని మరింత బలోపేతం చేసుకుందామనే ఆలోచన నేతలకు లేకపోవడం సమస్యగా మారింది.



మండే ఎండలకు... మందు!

(కాకినాడ/రాజమహేంద్రవరం ఆంధ్రజ్యోతి)

వేసవి ఉపశమనం కోసం మందుబాబులు తెగ తాగేస్తున్నారు. దీంతో మద్యం విక్రయాలు రయ్‌మని పరుగులు తీస్తున్నాయి. వేసవి తీవ్రత కారణంగా గత నెల నుంచి మద్యం విక్రయాలు భారీగా పెరిగిపోయాయి. ఒక్క ఏప్రిల్‌లోనే మందుబాబులంతా కలిపి ఉమ్మడి జిల్లాలో రూ.293 కోట్ల మద్యం తాగేశారు. గతేడాది ఇదేనెలలో విక్రయాలతో పోల్చితే రూ.17 కోట్లు అధికం. బీర్ల విక్రయాలైతే ఏకంగా 133 శాతం పెరిగాయి. గతేడాది ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో మం దు బాబులు 1.21 లక్షల బీరు కేసులు తాగేస్తే ఈ ఏడాది ఏప్రిల్‌లో 2.81 లక్షల బీరు కేసులు ఎత్తేశారు.విభజిత జిల్లాల వారీగా పరిశీలిస్తే కాకినాడ జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో రూ.95.52 కోట్లు అమ్మకాలుంటే ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.104 కోట్లకు చేరింది. తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో రూ.90.76 కోట్లు ఉంటే ఇప్పుడు రూ.100.23 కోట్లకు చేరింది.కోనసీమను మినహాయిస్తే ఈ రెండు జిల్లాల్లో విక్రయాలు భారీగా పెరిగాయి.

ఈనెలలో అప్పుడే రూ.150 కోట్లకుపైగానే..

మే నెలలోను మందుబాబులు తగ్గేదేలే అన్న ట్టు తెగ తాగేస్తున్నారు. ఇప్పటి వరకు కాకినాడ జిల్లాలో రూ.53 కోట్ల విలువైన మద్యం తాగే శారు. బీరు కేసులు గతేడాది మే నెల 16 వరకు జిల్లాలో 24,339 విక్రయించగా ఇప్పుడు 56,375 అమ్ముడయ్యాయి. కోనసీమ జిల్లాలో గతేడాది మే నెల మొత్తం మీద రూ.98.88 కోట్ల విక్ర యించగా ఈనెలలో ఇప్పటివరకు రూ.45.41కోట్ల మద్యం అమ్ముడైంది. తూర్పుగోదావరి జిల్లాలో 58,950 ఐఎంఎల్ కేసులు, 50,587 బీరు కేసులు విక్రయించడంతో రూ.49.46 కోట్ల విక్రయాలు నమోదయ్యాయి. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం ధరలు మందుబాబులకు షాక్ కొట్టాయి. నాసిరకం బ్రాండ్లకు ప్రీమియం ధరలు వసూలు చేసి వందల కోట్లు పిండేశారు.ప్రస్తుత ప్రభుత్వం ధరలు అమాంతం తగ్గిం చేసింది. ప్రముఖ బీరు,ఐఎంఎల్ బ్రాండ్లను అన్ని దుకాణాల్లో అందుబాటులో ఉంచింది.ధరలు తగ్గడం.. వేసవితాపంతో మందుబాబులు తెగ తాగేయడంతో అమ్మకాలు పెరిగాయి.

ఉమ్మడి జిల్లాలో బీర్లు పొంగాయ్

- వేసవి ఉపశమనం పేరుతో తెగతాగేశారు
- ఉమ్మడి తూ.గో.జిల్లాలో పెరిగిన అమ్మకాలు
- ఏప్రిల్‌లో రూ.293 కోట్ల మద్యం విక్రయాలు
- గతేడాది పోల్చితే రూ.17 కోట్లు అధికం
- రికార్డుస్థాయిలో బీర్లను తాగేసిన ప్రియులు
- గత నెలలో 2.81 లక్షల బీరు కేసులు
- నిరుడు ఇదే నెలలో 1.21 లక్షల కేసులే
- గతేడాదితో పోల్చితే 133 శాతం అధికం
- ఈ నెలా మద్యం విక్రయాలు రయ్
- 16 నాటికి రూ.150 కోట్లు సేల్స్
- బీరు కేసులు 1.49 లక్షలు విక్రయం



ఊదిపారేస్తున్నారంతే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో బీర్లు, ఇతర ఐఎంఎల్ మద్యం విక్రయాలు కలిపి రూ.276 కోట్లు జరిగాయి.ఈ ఏడాది ఏప్రిల్‌లో విక్ర యాలు రూ.293 కోట్లకు పెరిగాయి. ఇందులో అత్యధికంగా బీర్లు అమ్ముడయ్యాయి.గతేడాది ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో 1,21,396 కేసుల బీర్లు విక్రయించగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏకంగా 2,81,637 కేసుల బీర్లు మందుబాబులు తాగేశారు.బీర్ల విక్రయాలు అప్పటితో పోల్చితే ఈసారి ఏకంగా 133 శాతానికిపైగా పెరిగాయి.

- కాకినాడ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో రూ.95.52 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది.ఇందులో 41,940 కేసుల బీర్లు ఉండగా, ఐఎంఎల్ మద్యం 96,317 కేసులు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌కు వచ్చేసరికి ఈనెలలో కాకినాడ జిల్లాలో విక్రయాలు రూ.104కోట్లకు పెరిగింది.ఒక్క బీర్లే ఏకంగా 97,796 కేసులు అమ్ముడయ్యాయి. కాకినాడ నార్త్ స్టేషన్ పరిధిలో గత నెలలో ఏకంగా రూ.26కోట్ల మద్యం అమ్ము డైంది. కాకినాడ సౌత్ స్టేషన్ పరిధిలో రూ.18 కోట్లు, తుని పరిధిలో రూ.15.84 కోట్ల విక్ర యాలు జరిగాయి.
- తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది ఏప్రిల్ నెలలో రూ.90.76 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగ్గా, ఈ ఏడాది 100.23కోట్ల మద్యం అమ్ముడైంది. ఒక్క బీర్ల విక్రయాల్లో ఏకంగా 114 శాతం పెరుగుదల నమోదైంది. అత్యధికంగా రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్ పరిధిలో గత నెలలో రూ.22.66 కోట్లు మద్యం విక్రయాలు జరగ్గా, బీర్ల విక్ర యాల్లో 131 శాతం వృద్ధి నమోదైంది. రాజమహేంద్రవరం దక్షిణం పరిధిలో రూ.20.44 కోట్లు, నిడదవోలు పరిధిలో 13.44కోట్లు, దేవర పల్లి 12.33 కోట్లు, కోరుకొండ 8.91 కోట్లు చొప్పున మద్యం విక్రయాలు జరిగాయి. దేవరపల్లి సర్కిల్ పరిధిలో గతేడాది ఏప్రిల్‌లో 3,623 కేసుల బీర్లు అమ్ముడైతే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏకంగా 9,253 బీర్ల కేసులు విక్రయించారు. బీర్ల విక్రయాల్లో గతేడాదితో పోల్చితే 155 శాతం అధికం.
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో రూ.90.11 కోట్ల మద్యం విక్రయాలు జరగ్గా ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.88.81 కోట్లు నమోదయ్యాయి. ఇక్కడ గతేడాదితో పోల్చితే ఏప్రిల్‌లో విక్రయాలు కొంత తగ్గాయి. ప్రధా నంగా ఈ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో ఈ జిల్లాలో 95,444 కేసుల ఐఎంఎల్ మద్యం అమ్ముడైతే ఈ ఏడాది ఏప్రిల్‌లో 1,17,484 కేసుల ఐఎంఎల్ అమ్ముడైంది.బీరు కేసులు అప్పట్లో 34,036 విక్రయిస్తే.గత నెలలో 79,005 కేసులు విక్రయింఆరు. బీర్ల విభాగంలో అమ్మకాలు అప్పటితో పోల్చితే 132 శాతం పెరిగాయి.

తవ్వేయ్.. తోలేయ్!



ఇది సీతానగరం మండలం నల్గొండలో గ్రావెల్ కొండ.. యథేచ్ఛగా ఇలా తవ్వేస్తున్నారు..



అధికారులు కళ్లుండీ చూడలేకపోతున్నారు.. నోరుండీ మాట్లాడలేకపోతున్నారు.. అధికారం ఉండీ అడ్డుకోలేకపోతున్నారు.. అక్రమార్కులు మట్టి, గ్రావెల్ అక్రమంగా తరలించుకుపోతున్నా చూస్తూ ఉండిపోతున్నారు.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా ప్రశ్నించలేకపోతున్నారు.. ఇది ఒక్క మండలంలో సమస్య కాదు.. రంగంపేట, గోకవరం, సీతానగరం మండలాల్లోనూ ఇదే పరిస్థితి.. అక్రమార్కులు మాత్రం ఎవరికివ్వాల్సింది వారికిచ్చేస్తే ఎలా మాట్లాడతారని అని ఆరోపించడం కొసమెరుపు..

- రెచ్చిపోతున్న మాఫియా
- అక్రమంగా మట్టి,గ్రావెల్ తరలింపు
- కన్నెత్తి చూడని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

గోకవరం, మే 19 (ఆంధ్రజ్యోతి) : మట్టి, గ్రావెల్ వ్యాపారం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. గోకవరం మండలంలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా అడ్డగోలుగా తరలిస్తున్నారు. అడ్డుకునేవారు లేక పేట్రేగిపోతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి దందాకు పాల్పడుతున్నా అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.అక్రమార్కులు యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు, ఇటుక బట్టీలకు తరలి ంచి సొమ్ములు చేసుకుంటున్నారు. గోకవరం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. వాటిని చదును చేయడానికి మట్టి, కంకరకు గిరాకీ ఏర్పడింది. ఇదే అదునుగా అక్రమార్కులు మట్టి తవ్వకాలకు తెరలేపారు. వీరలింకపల్లి, గోకవరం, కొత్తపల్లి, తరతర ప్రాంతాల్లో అనేక ఇటుక బట్టీలు ఉన్నాయి. బట్టీల నిర్వహణకు అవసరమైన మట్టి పరిసర ప్రాంతాల్లో ఉండడంతో చెరువులను గుల్ల చేసేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఈ అక్రమ వ్యాపారం మూడు ట్రాక్టర్లు, ఆరు లారీల చందంగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా చెరువులు,ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి ధరలు నిర్ణయించుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. వీరలింకపల్లి గ్రామ సమీపంలో ఉన్న రాజు చెరువు, కొత్తపల్లిలో పెదపాత్రుని చెరువుల నుంచి ప్రస్తుతం మట్టి అక్రమ రవాణా జోరుగా జరుగుతోంది. రాజు చెరువు నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా టిప్ప ర్లతో ఏ జంకూ లేకుండా మట్టిని తరలిస్తు న్నారు. పెదపాత్రుని చెరువు నుంచి ఎక్కువగా రాత్రి వేళ రవాణా జరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో సాగుతున్న అక్రమ మట్టి దందాపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

వీరవల్లిలంక చెరువులో యంత్రాలతో మట్టి తవ్వి..టిప్పర్లలో తరలింపు





చెరువులు.. చేలు ఖాళీ...

రంగంపేటలో మట్టి దందా

రంగంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది వేసవి వచ్చిందంటే చాలు మట్టికి రెక్కలు వస్తాయి.. అక్కడ ఇక్కడ అని ఏముంది.. జిల్లా అంతటా యథేచ్ఛగా తరలించేస్తారు. అయినా అడిగే నాథులు ఉండరు.. పట్టించుకునే అధికారులు లేరు. మెరకపేరుతో మట్టిని తరలిస్తున్నా కళ్లప్పగించి చూస్తున్నారు. రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో సాగుతున్న దందా దీనికి ఉదాహరణ. గత కొంత కాలంగా గ్రామంలో రాత్రి పగలు తేడా లేకుండా ఎక్స్‌క వేటర్లతో మట్టిని తవ్వి ఎక్కువగా లే అవుట్లు, ఇటుక బట్టీలకు ట్రాక్టర్లతో తరలిస్తుంచేన్నారు. ప్రభుత్వానికి సీనరేజ్ కట్టకుండా అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్నారు. అయినా అధికారుల్లో మాత్రం చలనం లేదు.ఇంటి నిర్మాణం, మెరక పనులకు మట్టిని తరలించాలంటే గనులు, భూగర్భ, రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి.రెవెన్యూ కార్యాలయం నుంచి నిరభ్యంతర పత్రం పొందిన తర్వాత నిర్ణీత సీనరేజి రుసుం గనుల శాఖకు చెల్లించి అనుమతి పొందిన తరువాత మట్టి తవ్వకాలు జరుపుకోవచ్చు.కానీ ఎటువంటి అనుమతుల్లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.ట్రాక్టర్ మట్టి రూ.600 నుంచి రూ.700 వరకు విక్రయి స్తున్నా రు.గ్రామ వీధుల్లో ట్రాక్టర్లు రయ్, రయ్ మంటూ తిరుగుతుంటే చిన్న పిల్లలు, గ్రామ ప్రజలు బెంబేలెత్తుపోతున్నారు.అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని, గ్రామంలోని ట్రాక్టర్ల స్పీడును నియంత్రించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్ అన సూయను ఆంధ్ర జ్యోతి ఫోన్‌లో సంప్రదించగా మండలంలో ఎవరికీ పొలాల్లో మట్టి తవ్వకాలకు ఎటు వంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.



వడిశలేరులో పొలాల నుంచి మట్టి తరలింపు

గ్రావెల్ కొండలు.. కరిగిపోతున్నాయ్!

సీతానగరం,మే 19 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం మండలంలో ఇసుక, ఎర్రమట్టి అక్రమంగా తరలించేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. సీతానగరం మండలం నల్గొండ సమీపంలోని కొండలను దొలిచి ఎర్రమట్టి అక్రమంగా తరలించేస్తున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా యథేచ్ఛగా అక్రమ రవాణా సాగుతోంది. అధికారులు మాత్రం చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా తీసుకుని అక్రమార్కులు కొండలను తవ్వి ఎర్రమట్టిని అమ్ముకుంటూ కోట్లాది రూపాయలు గడిస్తున్నారు.దీనిపై సీతానగరం తహశీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా అక్రమ రవాణా విషయం తెలియదని వెంటనే చర్యలు తీసుకుంటానని తెలిపారు..

పీజీఆర్ఎస్ అర్జీలపై ఆడిట్

ప్రతి ఫిర్యాదుకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలి : కలెక్టర్ ప్రశాంతి



కృత్రిమ అవయవాలు అందజేస్తున్న కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయిలో జరిగిన ఆడిట్ నివేదికల ప్రకారం 50 శాతం మంది ఫిర్యాదుదారులకు ఎండార్స్‌మెంట్‌లు అందలేదన్న ఆరోపణలు వస్తున్నాయని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి, ఇతర అధి కారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు ఎండార్స్ మెంట్‌లు అందడంలేదనే ఫిర్యాదులు రాకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే ఫిర్యాదుపై సమగ్ర అవగాహన పొందవచ్చన్నారు. కొన్ని సమస్యలను ఎంపీడీవో, తహశీల్దార్, ఎస్‌హెచ్‌వో కూడిన మండల స్థాయి కమిటీకి నివేదిస్తున్నట్టు తెలిపారు. పరిష్కారం చూపలేని అంశాలకు కారణాలు తెలపకపోతే సీఎంవో నుంచి పదేపదే ఆదేశాలు వస్తూనే ఉంటాయని తెలిపారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సమకూర్చిన రూ.25 వేలు విలువైన కృత్రిమ అవయవాలను కలెక్టర్ ప్రశాంతి నలుగురికి అందించారు. కార్యక్రమంలో సీపీవో ఎల్.అప్పలకొండ, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, ఇన్‌చార్జి డీఎస్‌వో ఎంఆర్‌ఆర్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

డీపీవోలో గ్రీవెన్స్‌కి 40 అర్జీలు

రాజమహేంద్రవరం, మే 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్(పబ్లిక్ గ్రీవెన్స్) కు జిల్లా నలుమూలల నుంచీ వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ స్వయంగా మాట్లాడి 40 అర్జీలను స్వీకరించారు. వారి సమక్షంలోనే సంబంధిత అధికారితో మాట్లాడి చట్ట ప్రకారం త్వరితగతిన ఫిర్యాదును పరిష్కరించాలని ఆదేశించారు.అడిషనల్ ఎస్పీలు ఏవీ.సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్, మిగిలిన ఉద్యోగులు

హాజరు 14.. ఉన్నది 8

మంత్రి ఇలాఖాలో అధికారుల తీరిది

నిడదవోలు, మే 19 (ఆంధ్రజ్యోతి) : సాక్షాత్తూ మంత్రి దుర్గేష్ నియోజకవర్గ కేంద్రమైన నిడదవోలులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యంతో ఉంటున్నారు..ప్రజల సమస్యలు వినేందుకు టైమ్ కేటాయించలేకపోతున్నారు..హాజరు వేయించుకుని వెళ్లిపోయి పనులు చక్కబెట్టుకుంటున్నారు. నిడదవోలు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సుమారు 25 మంది మండలస్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉండగా ఉదయం 10.30 కల్లా 14 మంది అధికారులు హాజరుపట్టీలో సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. తహశీల్దార్ బి.నాగరాజు నాయక్‌తో పాటు మరో ఏడుగురు మాత్రమేపాల్గొన్నారు.అయ్యా మంత్రి వర్యా అధికారుల పనితీరుపై దృష్టి సారించండి

'నేడు మినీ మహానాడుకు తరలిరావాలి'

ఉంగ్రాజవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): వేలివెన్నులో మంగళవారం మధ్యాహ్నం మూడుగంటలకు నిర్వహించే నిడదవోలు నియోజకవర్గస్థాయి మినీ మహానాడుకు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా హాజరుకావాలని మాజీఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు కోరారు.

వచ్చేస్తోంది.. మరో హై..వే!

- ఖమ్మం నుంచి దేవరపల్లి ఎన్‌హెచ్-365 బీజీ
- జూన్ నాటికి పూర్తి చేయాలని ప్లాన్
- ఇప్పటికే దేవరపల్లి వద్ద టోల్‌ప్లాజా సిద్ధం
- పొంగుటూరు వద్ద 11 హెక్టార్ల భూ సమస్య
- దగ్గర దారికి కోర్టు అడ్డంకి
- 3 కి.మీ మేర ఆగిన పనులు
- ఆగస్టు 15న ప్రారంభించే ఆలోచన


దేవరపల్లి వద్ద సిద్ధం చేసిన టోల్‌ప్లాజా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మరో కొత్త జాతీయ రహదారి వస్తోంది.. కేవలం ప్రారంభానికి మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అయితే చిన్న సమస్య కారణంగా నేటికీ ఆరం భానికి నోచుకోలేదు..ఆ సమస్య పరిష్కారమైతే విజయవాడ వెళ్లినంత ఈజీగా హైదరాబాద్‌కు వెళ్లవచ్చు. ఖమ్మం నుంచి దేవరపల్లి మండలంలోని దేచర్ల వరకూ భారత మాల ఆర్థిక నడవా పథకం కింద నాలుగు వరు సల జాతీయ రహదారి(ఎన్‌హెచ్)- 365జీబీ పేరుతో ఓ గ్రీన్‌మార్గం నిర్మాణం అవుతోంది. రహదారి పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. జూన్ నాటికి ఇది పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. ఆగస్టులో ఈ జాతీయ రహదారిని జాతికి అంకితం చేయాలనే ఆలోచనతో ఉన్నారు. ఇంత పెద్ద జాతీయ రహదారికి కేవలం మూడు కిలోమీటర్ల మేర 11 హెక్టార్ల భూ సేకరణ వివాదంగా మారింది. సదరు భూయజమానులు కోర్టును ఆశ్రయిం చడంతో అక్కడ వివాదం కొనసాగుతోంది. ఈ మూడు కిలోమీటర్ల మేర తప్ప మిగతా హైవే నిర్మాణం సుమారుగా పూర్తయినట్టే. హైదరాబాద్ నుంచి విశాఖ, కలకత్తా వైపు వెళ్లేవారు విజయవాడ మీదగా వెళ్లాంటే 670 కిలోమీటర్లు హైవేలో 12 గంటల ప్రయాణించాల్సి వస్తుంది. చాలా మంది ఖమ్మం మీదగా కొవ్వూరు- రాజమహేంద్రవరం ఫోర్త్ బ్రిడ్జి మీదగా దగ్గర దారి కోసం పయనిస్తూ ఉంటారు. ప్రస్తుతం గుండుగొలను, నల్లజర్ల, కొవ్వూరు మీదుగా వెళ్లడం వల్ల కొంత దూరం తగ్గింది. ఖమ్మం నుంచి రావడం వల్ల మరింత దూరం తగ్గుతుంది. కేవలం 550 కిలోమీటర్ల మేర పయనిస్తే ఎనిమిది గంటల్లో హైదరాబాద్ చేరుకోవచ్చు.దీనికోసం ఖమ్మం నుంచి దేవరపల్లి మండలంలోని దేచర్ల వరకూ 165 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల జాతీయ రహదారిని భారతమాల ఆర్థిక నడవా పథకం కింద ఎన్‌హెచ్ -365జీబీ పేరుతో నిర్మిస్తున్నారు. దీనివల్ల హైదరాబాద్ విశాఖపట్నం మధ్య 120 కిలోమీటర్ల దూరం తగ్గిపోతుంది. సుమారు రూ.3,573 కోట్ల ఖర్చుతో 165 కిలోమీటర్ల మేర దీనిని నిర్మిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో ఐదు ప్రాజెక్టుల కింద పనిజరుగుతుంది. 117 అండర్ పాసులు, 33 కల్వర్టులు, 9 భారీ వంతెనలు నిర్మాణం వేగంగా జరుగుతున్నాయి. దేవరపల్లి వద్ద టోల్‌ప్లాజా కూడా ఏర్పాటు చేశారు. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకూ కేవలం కొయ్యలగూడెం పరిధిలోని పొంగుటూరులో మూడు కిలోమీటర్ల మేర తప్ప, మిగతా హైవే అంతా సుమారుగా పూర్తయిపోయింది.

కోర్టు సమస్య త్వరగా పరిష్కరించాలి..

మంచి పనులకు కూడా కొన్ని సమస్యలు వస్తుంటాయి. అలాంటపుడు ప్రభుత్వం, అధికారులు సీరియస్‌గా తీసుకుని వాటిని పరిష్కరించి ముందుకు సాగాలి. ప్రజాప్రతినిధులు కూడా స్థానికంగా ఇటువంటి సమస్యలు పరిష్కరించడంపై దృష్టిపెట్టాలి. కొయ్యలగూడెం సమీపంలోని పొంగుటూరుప్రాంతంలో మూడు కిలోమీటర్ల మేర 11 హెక్టార్ల భూ సేకరణ సమస్య కోర్టులో ఉంది. కోర్టు తీర్పు రిజర్వులో ఉన్నట్టు అధికారుల కథనం. ఈ తీర్పు వెలువడితేనే ఈ మూడు కిలోమీటర్ల మేర హైవే పనులు ఆరంభమ వుతాయి. ఆగస్టు 15లోపు పూర్తి చేయాలనే ఆలోచనతో ఉన్నా అది సాధ్యపడేదిగా కనిపించడంలేదు. కోర్టు అనుమతి ఇవ్వాలి. భూసేకరణ ప్రక్రియ పూర్తికావాలి. పనులు చేపట్టాలి. మూడు కిలోమీటర్ల మేర నాలుగు వరసల హైవే నిర్మాణం అంటే కొంత సమయం పడుతుంది. ఇక ఆగస్టు అంటే కేవలం మూడునెలలు మాత్రమే సమయం ఉంది. కాని యంత్రాంగం ఈ పనులు త్వరగా పూర్తి చేసేలా ప్రయత్నం చేయవలసిందే. మూడు కిలోమీటర్ల మేర ఏర్పడిన సమస్యను యుద్ధప్రాతిపదికను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'పీజీఆర్ఎస్ సమస్యలు పరిష్కరించాలి'


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ పరిధిలో ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మిత తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ పీజీఆర్ఎస్‌ను నిర్వహించారు. ఇందులో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆర్డీవో సుస్మిత మాట్లాడుతూ డివిజనల్ నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 10 ఫిర్యాదులు అందా యన్నారు. దీనికి డివిజనల్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అలాగే టోల్‌ఫ్రీ నెంబర్ 1100 కు ఫోన్‌చేసి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల డివిజనల్, మండలస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవంలో శేషారావు


నడిపల్లికోటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న శేషారావు

పెరవలి, మే 19 (ఆంధ్రజ్యోతి): నడిపల్లి కోటలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవంలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు సోమవారం పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన అఖండ అన్నసమారాధనకు విచ్చేసిన ఆయనకు గ్రామస్థులు ఆహ్వానం పలికారు. ఈయనతో పాటు వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాస్ ఉన్నారు. అలాగే కాకరపర్రులో జరుగుతున్న భూ సమేత వెంకటేశ్వరస్వామి, అయ్యప్ప స్వామివిగ్రహాల సంపూర్ణప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని దివ్యదర్శనం పొందారు.

క్వారీ కార్మికుల వేతన ఒప్పందం సఫలం


కార్మిక సంఘాలకు వేతన ఒప్పందం పత్రం అందజేస్తున్న అనిల్

దేవరపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): క్వారీ క్రషర్‌లో పనిచేసే ప్రతి కార్మికుడి సమస్యను యాజమాన్యం సానుకూలంగా పరిష్కరిస్తుందని వెస్ట్‌గోదావరి క్వారీ క్రషర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంధ్రూ అనిల్ అన్నారు. సోమవారం గౌరీపట్నంలోఐఎఫ్‌టీయూ, క్వారీ అండ్ క్రషర్స్ యాజమానుల మధ్య కార్మిక వేతన ఒప్పందం అగ్రిమెంట్ సఫలమైంది. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడు తూ ఈ వేతన ఒప్పందం మే 5 నుంచి మే 4 2028 వరకు అమలులో ఉంటుందన్నారు. ప్రస్తుతం ఇచ్చే జీతంపై అదనంగా 2,900 ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే సంవత్సరం పనిచేసిన ఆపరేటర్లకు నెలజీతం బోనస్‌గా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు పీ.నాగేశ్వరరావు, ఎస్.హరి గోపాల్, సీహెచ్ రమేశ్ మాట్లాడాన్నారు. కార్యక్రమంలో క్వారీ అండ్ క్రషర్స్ అసోసియేషన్ సంఘ నాయకులు, ప్రధాన కార్యదర్శి దోనెల్లి మధుబాబు, ఉపాధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణ రాజు, కోశాధికారి కోట్ల కనకేశ్వరరావు, యాజమాన్య సంఘ నాయకులు కొప్పాక మెహర్ చైతన్య, కేసాయి, గన్నిన శ్రీనివాస్, దాపర్తి వీరకృష్ణ, కొండపాముల సతీశ్, కార్మికసంఘం నాయకులు, ఐఎఫ్‌టీయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'కంపోస్టు గుంతలు తవ్వాలి'


కంపోస్ట్ గుంతలు తీస్తున్న దృశ్యం

తాళ్లపూడి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్ ఈజీఎస్ ద్వారా గ్రామాల్లో పాడి రైతులు, ప్రజలు తమ గృహాల్లో కంపోస్టు గుంతలు తవ్వుకోవచ్చని ఏపీవో రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం మాట్లాడుతూ కంపోస్ట్ పీట్స్ తవ్వడానికి ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పిస్తామన్నారు.

ధూమంతనగూడెంలో ఉచిత వైద్యశిబిరం


శిబిరంలో పాల్గొన్న జనసేన పార్టీ నేత సువర్ణరాజు, తదితరులు

దేవరపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో పేదలకు ఉచిత వైద్యం అందించటం ఎంతో గొప్ప విషయమని గోపాలపురం నియోజకవర్గ జనసేన నాయకుడు సువర్ణరాజు అన్నారు. ధూమంతనగూడెంలో సాయి ప్రోపర్టీస్ అండ్ ప్రాజెక్ట్స్ ఎర్రచందనం ఫామ్‌ల్యాండ్ కంపెనీ, ధూమంతన గూడెం జనసేన పార్టీ ఆధ్వర్యంలో మదర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులతో సోమవారం ఉచిత వైద్యశిబి రాన్ని నిర్వహించారు. ఇందులో బీపీ, షుగర్, ఇతర వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గుడిసే వెంకటరత్నం, ఐనాల నరసింహమూర్తి, పల్లంట్ల పాండు, నాయుడు దుర్గాప్రసాద్, ధూమంతన సుబ్బారావు, అడబాల ప్రసాద్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొవ్వూరులో టీడీపీ మినీ మహానాడు

కొవ్వూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం మినీ మహానాడు నిర్వహిస్తున్నట్టు ద్విసభ్య కమిటీసభ్యుడు కంటమణి రామకృష్ణారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ఉదయం తొమ్మిది గంటలకు నియోజకవర్గస్థాయి మహానాడు జరుగుతుందన్నారు. దీనికి పట్టణం, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ, వార్డు కమిటీ నేతలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి


భాష్యం స్కూల్‌లో యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

దేవరపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లలను వ్యాయామం చేయడానికి సమయం కేటాయించాలని హైదరాబాద్ ఫిట్‌నెస్ జుంబాడాన్స్ ట్రైనర్ డాక్టర్ గుత్తా రమాదేవి అన్నారు. దేవరపల్లిలో భాష్యం స్కూల్ లో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యా ర్థులకు సోమవారం ప్రాశ్చాత్య నృత్యరీతులు, వ్యాయామంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి, ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలకు పిల్లలు బానిసలు కాకుండా వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దిక్కుతోచని స్థితిలో...

వైట్‌బర్లీ పొగాకు రైతులు

● కొనేవారు లేక ఎదురుచూపు ● మొహం చాటేసిన కంపెనీ అధికారులు


భీమోలులో పంటను చూపుతున్న రైతులు

గోపాలపురం, మే19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైట్‌బర్లీ పొగాకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొనుగోలుదారుల మాయలోపడి భీమోలు, కరగపాడులో దాదాపు 100 ఎకరాల్లో పంటను సాగుచేశారు. నాట్లు దశలో కొనుగోలు చేస్తామని కంపెనీ ప్రతినిధులు నమ్మబలికారు. అంతేకాకుండా సాగుకు అవసరమయ్యే మందులను కూడా సరఫరా చేశారు. తీరా పంటపూర్తై చేతికి అందివచ్చే తరుణంలో మాటమార్చి కొనుగోలు చేసేందుకు నిరాకరించారు. దీంతో వారంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అధిక మొత్తం పెట్టుబడి పెట్టగా, ప్రస్తుతం కొనేవారులేక అయోమయంలో పడ్డారు. నాట్లుదశలో కిలో రూ.150కి కొనుగోలు చేస్తామని చెప్పి, ఇప్పుడేమో నాణ్యతను బట్టి రూ. 120-150కి కొనుగోలు చేస్తామని చెపుతుండడంతో రైతులు కంగుతిన్నారు. దీంతో భీమోలులోని రైతులు నిరసన వ్యక్తం చేశారు.

కౌలుకు ...

దేవాలయ భూములు వేలం


వేలం నిర్వహిస్తున్న విశ్వనాథరాజు, సిబ్బంది

తాళ్లపూడి, మే 19 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి పంచాయతీ కార్యాలయంలో సోమవారం రాజమహేంద్రవరం పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రం భూముల వేలాన్ని దేవాదాయశాఖ అధికారులు నిర్వహించారు. తాళ్లపూడిలో 3 ఎకరాల 6 సెంట్ల భూమి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను కౌలు వేలంలో వేగేశ్వరపురానికి చెందిన మామిడాల బుజ్జి రూ. రెండులక్షల 8 వేలకు దక్కించుకున్నారు. వేలంపాటలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విశ్వనాథరాజు, సిబ్బంది లక్ష్మీనరసింహ, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో .. రైతుల ఫిర్యాదు


ఇన్‌చార్జి తహశీల్దార్‌కి వినతిపత్రం అందిస్తున్న పుల్లయ్య, తదితరులు

తాళ్లపూడి, మే 19 (ఆంధ్రజ్యోతి): తమ భూముల్లో బోట్‌మెన్ సొసైటీ ప్రతినిధులు ఇసుక నిల్వలు పెడుతున్నారని, తక్షణమే వాటిని ఖాళీ చేయించాలని వేగేశ్వరపురానికి చెందిన రైతులు తైలం పుల్లయ్య, తైలం ప్రసాద్ సహా పలువురు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు తహశీల్దార్ మోహన భారతికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని గోదావరి తీరంలో గల తమ సొంత భూముల్లో బోట్‌మెన్ సొసైటీ ప్రతినిధులు ఇసుక నిల్వలు పెడుతున్నారని, తక్షణమే వాటిని ఖాళీ చేయించాలని వారు కోరారు.

యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్ మార్పు


చీపురుగూడెంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చుతున్న దృశ్యం

నల్లజర్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురి అవడంతో యుద్ధప్రాతిపదికన నూతన ట్రాన్స్‌ఫా ర్మర్‌ను ఏర్పాటు చేసి వినియోగదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా చేసినట్టు టీడీపీ గ్రామ అధ్యక్షుడు చెల్లు పెద్ద రామన్న పేర్కొన్నారు. గ్రామంలో కంపన దుర్గారావు ఇంటి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సోమవారం పాడై పోయింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో ఏఈ రమణ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, నల్లజర్ల విద్యుత్ కార్యాలయంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేయించారు. దీంతో ఆ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేఎస్ జవహర్‌ను కలిసిన టీడీపీ నేతలు


జవహర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న దృశ్యం

ఉంగ్రాజవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన మాజీమంత్రి కేఎస్ జవహర్‌ను సోమవారం కొవ్వూరులో మండల ఎస్సీ సెల్ టీడీపీ అధ్యక్షుడు దిద్దే మధుబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో టీడీపీ నేతలు చదలవాడ నాని, బైపే రాజేశ్వరరావు, సామాజిక వేత్త చిర్రా గోపాల్, ఏపీఎస్ఆర్డీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చిర్రా శ్యామ్‌సన్, నాయకులు పాతకోకిల బాబీ ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


చీపురుగూడెంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న ఆకు తీగలు

నల్లజర్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం విడియాల వెంకటేశ్వరరావు పొలం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగలు అల్లుకున్నాయి. రహదారి పక్కనే ఉండడంతో రైతులు, పశువులు అటుగా వెళుతుంటారు. దీంతో కింద ఉన్న తీగలను అంటుకుంటే విద్యుత్‌సరఫరా అయ్యి పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంది.విద్యుత్ అధికారులు ఇకనైనా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అలుముకున్న తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే ఆవపాడులో విద్యుత్ వైర్లు చేతికి అందేవిధంగా కిందకు ఉన్నాయని, దీంతో పెద్ద వాహనాలు ఆ మార్గం గుండా వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ సమస్యను సైతం పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి


గాడి రాకేష్ మృతదేహం

కొవ్వూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడు మృతిచెందిన సంఘటన కొవ్వూరు మండలం సీతంపేటలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే చాగల్లు మండలం దార వరం గ్రామానికి చెందిన గాడి రాకేష్ (17) తన స్నేహితుడితో కలిసి గోదావరిలో స్నానానికి వెళ్లా డు. అయితే నది లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు అందులో మునిగిపోయాడు. తర్వాత తేలడంతో నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కొవ్వూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీహరిరావు తెలిపారు.

పదోన్నతుల్లోనూ ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి


ఏలూరులో మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చాగల్లు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పదోన్నతుల్లోనూ ఎస్సీ వర్గీకణ ప్రక్రియను తక్షణమే అమలు జరిగేలా జీవో విడుదల చేయాలని కోరుతూ అరుంధతీయ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం, ఎస్సీ వర్గీకరణ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఏలూరులో మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ జోనల్ చైర్మన్ జొన్నకూటి వరప్రసాద్, ఉద్యోగ సంఘాల నాయకులు కొడమంచిలి సత్యనారాయణ, బొల్లిపో మధుశేఖర్, మెరిపో సూరిబాబు, నీడా బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.